News Daily
ఎడిటర్ : B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in


# CK NEWS చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :44 | ఖమ్మం | గురువారం, ఏప్రిల్ 3, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## కంచె గచ్చిబౌలి భూములపై నివేదికివ్వండి..
### తెలంగాణకు కేంద్రం ఆదేశం




- కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిపై స్పందించిన కేంద్ర ప్రభుత్వం
- కోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకొని ముందుకు వెళ్లాలన్న కేంద్రం
- అటవీ చట్టానికి లోబడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశం
- వాస్తవ నివేదిక వివరాలను, తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో ఇవ్వాలన్న కేంద్రం

:కంచె గచ్చిబౌలి భూముల వ్యవహారంపై కేంద్రం స్పందించింది. ఆ 400 ఎకరాలపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని ఈ మేరకు తెలంగాణ అటవీ శాఖకు లేఖ రాసింది కేంద్ర పర్యావరణ శాఖ. HCUలో పర్యావరణానికి విఘాతం కలగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. అక్కడ చెట్లు, జంతుజాలానికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్రానికి సూచించింది. నిజానిజాలపై విచారణ సాగించి పూర్తి నివేదికను అందించాలని రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శిని కోరింది కేంద్ర అటవీ పర్యావరణ శాఖ.మరో వైపు కంచె గచ్చిబౌలి భూముల

వివరాలు 2లో..



## ఇది బలహీన వర్గాల
# ధర్మయుద్ధం

### 42% రిజర్వేషన్లకు పర్మిషన్ ఇవ్వాలె

- లేకుంటే ఈ ఉద్యమం నిప్పు రవ్వై దేశమంతా పాకుతది
- పరేడ్ గ్రౌండ్లో 10 లక్షల మందితో సభ పెడ్తం
- మేం మీ గుజరాత్ లో అమలు చేయమంటలేం
- ఢిల్లీలో కుర్చీ అడగలే.. ఎర్రకోటపై జెండా ఎగరేస్తమనలే తెలంగాణలో అమలు చేసుకుంటమంటున్నం
- మా డిమాండ్కు దిగి రావాలె.. లేదా సీటు దిగిపోవాలె
- లేకుంటే మీరెట్లా అధికారంలో ఉంటరో చూస్తం ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్

న్యూఢిల్లీ: దేశ రాజధాని హస్తిన వేదికగా 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లుపై గర్జించారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర జరిగిన బీసీ పోరు గర్జనలో మాట్లాడిన సీఎం.. ప్రధాని మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బడుగు, బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపిస్తే.. ఎందుకు ఆమోదించటం లేదని.. ఎందుకు అనుమతి ఇవ్వటం లేదని నేరుగానే ప్రశ్నించారు. బీసీ ప్రధానిగా చెప్పుకునే మోడీకి.. బీసీల ఆత్మ గౌరవం కనిపించటం లేదా అంటూ సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు.

తెలంగాణ రాష్ట్రం నుంచి బీసీ గర్జన మొదలైందని.. ఇది ధర్మ యుద్ధం అని.. ఇక నుంచి మేం ఢిల్లీకి వచ్చేది లేదని.. మోడీనే తెలంగాణ గల్లీ గల్లీకి రప్పిస్తాం అంటూ ప్రశ్నించారు సీఎం రేవంత్ రెడ్డి. పార్లమెంట్ లో బలం లేకపోయినా.. రైతు వ్యతిరేక నల్ల చట్టాలు తీసుకొచ్చారు.. ఆర్టికల్ 370 బిల్లు తీసుకొచ్చారు.. ఇప్పుడు వక్ఫ్ బిల్లు తీసుకొస్తున్నారు.. ఈ బిల్లులన్నింటికీ బీజేపీకి బలం లేకపోయినా తీసుకొచ్చారని.. అలాంటిది

వివరాలు 2లో..

## వక్ఫ్ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం



ఢిల్లీ: వివాదాస్పద వక్ఫ్ (సవరణ) బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుపై బుధవారం లోక్‌సభలో వాడీవేడీ చర్చ జరిగింది. 12 గంటల పాటు సుదీర్ఘ చర్చ అనంతరం అర్ధరాత్రి దాటిన తర్వాత బిల్లు ఆమోదం కోసం స్పీకర్ ఓం బిర్లా ఓటింగ్ నిర్వహించారు. అనుకూలంగా 282 మంది సభ్యులు ఓటు వేయగా.. 232 మంది సభ్యులు బిల్లును వ్యతిరేకించారు. భాజపా నేతృత్వంలోని ఎన్డీయే పక్షాలు, ప్రతిపక్ష ఇండియా కూటమిలోని ప్రధాన పార్టీలు తమ ఎంపీలు అందరికీ విప్ జారీ చేసిన విషయం తెలిసిందే. గురువారం వక్ఫ్ బిల్లు రాజ్యసభకు వెళ్లనుంది. ఈ బిల్లుపై చర్చకు ఎగువసభలో 8 గంటల సమయాన్ని కేటాయించారు.

## ప్రతీకార సుంకాలపై ట్రంప్ కీలక ప్రకటన..



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలుదేశాలపై ప్రతీకార సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ అర్ధరాత్రి నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని తెలిపారు. వైట్‌హౌస్‌లోని రోజ్ గార్డెన్‌లో నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఈ విషయాలు వెల్లడించారు.

వివరాలు 2లో..

## 400 ఎకరాలను ధ్వంసం చేస్తుంటే హైడ్రా, రంగనాథ్ ఎక్కడ?

- కేసీఆర్ హరిత హారం చేస్తుంటే కాంగ్రెస్ హరిత సంహారం చేస్తోందని ఆగ్రహం
- విద్యార్థులు న్యాయం కోసం పోరాటం చేస్తున్నారన్న జగదీశ్ రెడ్డి
- బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే అడ్డుకోవచ్చని స్పష్టీకరణ



హైదరాబాద్ :కంచ గచ్చిబౌలి ప్రాంతంలోని 400 ఎకరాల భూమిని ప్రభుత్వం ధ్వంసం చేస్తుంటే హైడ్రా, కమిషనర్ రంగనాథ్ ఎక్కడకు వెళ్లారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. హెచ్‌సీయూ పరిధిలో మూడు చెరువులు

వివరాలు 2లో..

## మీ మంత్రివర్గంలో 46 శాతం బీసీలు ఉన్నారా?

### 42 శాతం రిజర్వేషన్ల అమలు నుంచి తప్పించుకోవడానికే ధర్నా


### సీఎం రేవంత్‌రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం



బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై అసెంబ్లీలో చేసిన బిల్లు అమలు నుంచి తప్పించుకోవడానికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ సంఘాల ముసుగులో దిల్లీ జంతర్‌మంతర్‌లో ధర్నాకు దిగారని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచడంలో రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని.. తాము ముందు నుంచీ చెప్తున్నది ఇప్పుడు మరోసారి నిరూపితమైందన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. "బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి ఇప్పుడు ఆ బాధ్యతను కేంద్రంపై ఎలా నెడతారు? రిజర్వేషన్ల పెంపు మీ పరిధిలో లేకపోతే ఆ హామీ ఎలా ఇచ్చారు? రేవంత్‌రెడ్డి

వివరాలు 2లో..

## ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన నాగబాబు...
### సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు



- ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా నాగబాబు ఏకగ్రీవం
- నాగబాబుతో ప్రమాణ స్వీకారం చేయించిన మండలి చైర్మన్ మోషేన్ రాజు
- సతీసమేతంగా చంద్రబాబును కలిసిన నాగబాబు

వివరాలు 2లో..

## నేను ఏది నమ్ముతానో అదే పాటిస్తాను

### తాడేపల్లిలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో జగన్ సమావేశం
### విలువలు, విశ్వసనీయతను నమ్మే వ్యక్తిని నేను అంటూ జగన్ ప్రసంగం
### పార్టీ కూడా అలాగే ఉండాలని ప్రతిక్షణం ఆశిస్తున్నానని వెల్లడి



వైసీపీ అధినేత జగన్ తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. కూటమి ప్రభుత్వ ఆగడాలను ధైర్యంగా ఎదుర్కొన్నారంటూ వారిని ఆయన అభినందించారు. "మిమ్మల్ని చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత ఉండాలని నమ్మే వ్యక్తిని. నేను అలాగే ఉంటాను, పార్టీకూడా అలాగే ఉండాలని ప్రతిక్షణం ఆశిస్తున్నాను.

వివరాలు 2లో..

## ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పొడిగింపు

- రాయితీ గడువును ఈ నెలాఖరు వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు
- నాలుగేళ్లుగా పెండింగులో ఉన్న ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు అవకాశం
- ఎల్ఆర్ఎస్ రుసుమును 25 శాతం రాయితీతో చెల్లించేందుకు అవకాశం



వివరాలు 2లో..

## సీఎం చంద్రబాబు చిత్ర కళ....




ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియాలో ఆసక్తికర వీడియో పంచుకున్నారు. అమరావతి కాన్సెప్ట్ తో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చిత్ర పటానికి చంద్రబాబు రంగులు అద్దడం ఆ వీడియోలో చూడొచ్చు. " ఇవాళ పెయింటింగ్ వేసేందుకు ప్రయత్నించాను. కళకు ఎంతో ఓపిక కావాలి. వారి ఊహలను ఎంతో అందంగా చిత్రీకరించి జీవం పోసే కళాకారుల పట్ల నాకు అమిత గౌరవం ఉంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.

# ఇది బలహీన వర్గాల ధర్మయుద్ధం

- మొదటి పేజి తరువాయి

తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు విషయంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు సీఎం రేవంత్ రెడ్డి.

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం.. బీసీ పోరు గర్జనకు దేశంలోని 16 పార్టీలు మద్దతు ప్రకటిస్తున్నాయని.. కాంగ్రెస్ వంద మందికి పైగా ఎంపీల మద్దతు ఇస్తున్నా.. పార్లమెంట్ లో ఎందుకు ఆమోదించటం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లుకు.. మోడీ ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే.. ఇది దేశ వ్యాప్తంగా ఉద్యమంగా రాజుకుంటుందని హెచ్చరించారు సీఎం రేవంత్ రెడ్డి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వంలోని తండ్రీ, కొడుకుల ఉద్యోగాలు ఊడగొట్టి.. తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని.. బీసీ బిల్లుకు అనుమతి ఇవ్వకపోతే ఢిల్లీ నుంచి మిమ్మల్ని తెలంగాణ గల్లీలకు రప్పిస్తాం అంటూ హెచ్చరించారు సీఎం రేవంత్ రెడ్డి.

ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా.. తెలంగాణ సమాజం నుంచి.. బడుగు బలహీన వర్గాల నుంచి మీకు విజ్ఞప్తి చేస్తున్నాం.. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం.. అసెంబ్లీలో తీర్మానం చేసి పంపించిన బిల్లుకు అనుమతి ఇవ్వండి లేదంటూ రాబోయే రోజుల్లో బీజేపీకి గడ్డుకాలమే అంటూ హెచ్చరించారు సీఎం రేవంత్ రెడ్డి.

42 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటే మోదీకి ఏంటి సమస్య..?

తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటే మోదీకి ఏంటి సమస్య అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఢిల్లీలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీ పోరు గర్జన మహా ధర్నాలో పాల్గొన్న సీఎం.. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. రిజర్వేషన్లు గుజరాత్ లో అడగలేదని, ఢిల్లీలో కుర్చీ అడగలేని బలహీన వర్గాలకు రిజర్వేషన్లు అమలు చేయాలంటే ప్రధాని మోదీ ఎందుకు మద్ధతు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లు ఇవ్వాల్సి వస్తుందనే జనగణన చేయటం లేదని ఆరోపించారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ కామెంట్స్:

భారత్ జోడో యాత్ర చేసి దేశ ప్రజల సమస్యలు రాహుల్ గాంధీ చూశారు

తమ వాటా తేల్చాలని బహుజనులు ఆయనను అడిగారు

అందుకే వాటా తేల్చేందుకు కులగణన చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది

ఏ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఆ రాష్ట్రంలో కులగణన చేస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు

దేశంలో అధికారంలోకి వచ్చి..జనగణనలో కులగణన చేసి దేశ వ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తాం

అందుకే నా మీద ఎంత ఒత్తిడి ఉన్నా కులగణన చేసి తీరాం

బీసీలకు రిజర్వేషన్ లు ఇవ్వాలంటే మీ లెక్క ఎంతో తెలియదు అని కోర్టులు అన్నాయి

అందుకే లెక్కలు తేల్చాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది.

కులగణన చేసి, బీసీ బిల్లును ఫిబ్రవరి 4 తేదీన అసెంబ్లీ తీర్మానం చేశాం.

అందుకే సోషల్ జస్టిస్ డేగా ఫిబ్రవరి 4ను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

బీసీలది ధర్మమైన కోరిక.. దాన్ని పార్టీలు అమలు చేయాలి

ఆనాడు మొరార్జీ దేశాయ్ మండల్ కమిషన్ ఏర్పాటు చేశారు

ఆ కమిషన్ 27 శాతం రిజర్వేషన్ ఇయ్యాలని సూచించింది

వీపీ సింగ్ అమలు చేస్తామంటే వ్యతిరేకంగా జనతా పార్టీ కమండల్ ఉద్యమాన్ని తెచ్చి అడ్డుకునే ప్రయత్నం చేసింది

ఆ జనతా పార్టీ నుంచి వచ్చిన ప్రతినిధే ఈ ప్రధాని మోదీ

బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాల్సి వస్తుందని, కులగణన చేయాల్సి వస్తుందని బీజేపీ ప్రభుత్వం 2021 జనాభా లెక్కలను చేయలేదు

బీజేపీ కుట్ర చేసి జనగణన ను వాయిదా వేస్తోంది

ఇది బహుజనుల సమస్య.. ఏకమై లెక్కలు తేల్చితేనే తప్ప ఉద్యోగ రాజకీయ రిజర్వేషన్లు పెరగవు

రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు చేసి 56.3 శాతం బలహీన వర్గాల లెక్కలు తెలంగాణ ప్రభుత్వం తేల్చింది

దేశానికి దిక్సూచిగా మొదటిసారి 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకుంది

ప్రభుత్వ పరిపాలన, అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం

రిజర్వేషన్ల అమలు కేంద్ర ప్రభుత్వ పరిధి.. అందుకే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాం

అయిననూ పోయి రావలెను హస్తినకూ అని మహాభారత యుద్ధ సమయంలో పెద్దలు చెప్పారు

అందుకే అయిననూ హస్తినకు వచ్చితిమి..

బీసీ రిజర్వేషన్లకు అనుమతి ఇస్తే తెలంగాణలో 10 లక్షల మందితో సన్మానం చేస్తాం

కానీ ఎందుకు బీసీ రిజర్వేషన్లకు ఆమోదం ఇవ్వడం లేదు

చట్టం, అధికారం ఉంది కదా అని మా మీద ఆదిపత్యం చలాయించాలని చూస్తే ఊరుకోం

ఢిల్లీలోనే ఎప్పుడూ ఉండరు.. మళ్లీ గల్లికి వస్తారు.. మాకు దొరుకుతారు.

మా దగ్గర లెక్క తేలింది.. మాకు అనుమతి ఇవ్వండి మోదీ గారు అంటే.. ఆయన పట్టించుకోవడం లేదు

# కంచె గచ్చిబౌలి భూములపై నివేదికివ్వండి..

- మొదటి పేజి తరువాయి

వివాదంపై తెలంగాణ హైకోర్టులో వాదనలు జరుగుతున్నాయి. పిటిషనర్ తరపున సీనియర్ కౌన్సిల్ రవి చంద్ వాదనలు వినిపిస్తున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 54 ను రద్దు చేయ్యాలని కోరుతున్నారు. కంచె గచ్చిబౌలి భూములు ప్రభుత్వానివేనని ప్రభుత్వం తెలిపింది. సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన ఒక్క అంగుళం భూమి కూడా ప్రభుత్వం తీసుకోలేదని వెల్లడించింది. విద్యార్థులు రాజకీయ పార్టీల ట్రాప్ లో పడొద్దని సూచించింది.

# 400 ఎకరాలను ధ్వంసం చేస్తుంటే హైడ్రా, రంగనాథ్ ఎక్కడ?

- మొదటి పేజి తరువాయి

ఉన్నాయని, చెరువులను కాపాడతామని చెబుతున్న హైడ్రా ఎక్కడకు వెళ్లిందని ప్రశ్నించారు. కేసీఆర్ హరితహారం చేస్తే, రేవంత్ రెడ్డి హరిత సంహారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీరుతో ఆ ప్రాంగణంలోని జంతువులు చిత్రహింసలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు న్యాయం కోసం పోరాటం చేస్తున్నారని అన్నారు.

బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే అధికారులతో మాట్లాడి పోలీసులను అడ్డుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ భూముల వ్యవహారంపై బీజేపీ, కాంగ్రెస్ కలిసి నాటకమాడుతున్నాయని ఆరోపించారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోకి పోలీసులు రాకుండా అడ్డుకోవచ్చని వ్యాఖ్యానించారు. డ్రోన్ కెమెరాలతో జేసీబీ వీడియోలు తీసిన ఐదుగురు విద్యార్థులను అరెస్టు చేశారని ఆయన మండిపడ్డారు.బీజేపీ సహాయంతోనే రేవంత్ రెడ్డి 400 ఎకరాల భూమిని తీసుకున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ భూములపై రాష్ట్ర ప్రభుత్వానికి హక్కు ఉంటుందని, కానీ పార్కులను, అడవులను విక్రయిస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీలోని భూమిని ఇవ్వవచ్చు అన్నారు. 400 ఎకరాల భూముల వ్యవహారంలో ప్రభుత్వ పెద్దల చీకటి కోణం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. గురువు చంద్రబాబు బాటలోనే శిష్యుడు రేవంత్ రెడ్డి నడుస్తున్నారని విమర్శించారు.

# ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పొడిగింపు

లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) రాయితీ గడువును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ రాయితీ గడువును ఈ నెలాఖరు వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత నాలుగేళ్లుగా పెండింగులో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఎల్ఆర్ఎస్ రుసుమును 25 శాతం రాయితీతో చెల్లించేందుకు మార్చి 31వ తేదీ వరకు మొదట గడువు ఇచ్చింది. తాజాగా ఈ గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగించింది. రాయితీపై ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించినప్పటికీ ఆశించిన స్థాయిలో రిజిస్ట్రేషన్లు జరగలేదు. ప్రజల నుంచి స్పందన ప్రభుత్వం అనుకున్నంతగా రాలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గడువును పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.

# ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన నాగబాబు...

:ఇటీవల ఏపీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. ఇవాళ నాగబాబు ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఏపీ శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు... నాగబాబుతో ప్రమాణ స్వీకారం చేయించారు. మండలి చైర్మన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు, జనసేన నేతలు హాజరయ్యారు. శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని... భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడతానని... అంటూ నాగబాబు ప్రమాణం చేశారు. అనంతరం నాగబాబు సతీసమేతంగా ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. నాగబాబు, పద్మజ దంపతులు సీఎం కార్యాలయానికి వెళ్లి చంద్రబాబుకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రబాబు... నాగబాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. నాగబాబుకు శాలువా కప్పి, వెంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించారు.

# ప్రతీకార సుంకాలపై ట్రంప్ కీలక ప్రకటన..

- మొదటి పేజి తరువాయి

ఈ రోజును ట్రంప్ 'లిబరేషన్ డే'గా నిర్వచించారు. ఈ కార్యక్రమానికి కేబినెట్ సభ్యులతో పాటు స్టీల్, ఆటోమొబైల్ కార్మికులను ట్రంప్ ఆహ్వానించారు. అమెరికా భవిష్యత్తు అమెరికన్ల చేతుల్లోనే ఉందన్నారు. ఇతర దేశాలు తమపై విధిస్తున్న సుంకాల్లో తాము సగమే విధిస్తున్నట్లు తెలిపారు. ఆయా దేశాలపై జాలితోనే ఇలా సగం సుంకాలు ప్రకటించినట్లు తెలిపారు. వీటిని రాయితీ టారిఫ్‌లుగా ట్రంప్ పేర్కొన్నారు. ఇక భారత్‌పై తాము 26 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఇక భారత ప్రధాని మోదీ గురించి ట్రంప్ ప్రస్తావించారు. తనకు మోదీ గొప్ప స్నేహితుడని, అయితే భారత్ అమెరికాతో సరైనవిధంగా వ్యవహరించడం లేదన్నారు. 52 శాతం సుంకాలను విధిస్తోందని ట్రంప్ అన్నారు. ఇక చైనాపై 34 శాతం సుంకాలు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు తెలిపారు. యూఎస్‌కు దిగుమతయ్యే అన్నిదేశాల ఉత్పత్తులపై కనీసం 10 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

అమెరికాకు ఈరోజు పునర్జన్మ: ట్రంప్

ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. "ఈ రోజు కోసం అమెరికా ఎన్నో ఏళ్లుగా వేచి చూస్తోంది. అమెరికా ఇండస్ట్రీ ఈరోజు పునర్జన్మించినట్లు అయింది. యూఎస్ మళ్లీ సుసంపన్నమైన దేశంగా అవతరించిన రోజుగా గుర్తుండబోతుంది. అమెరికాను చాలా ఏళ్లుగా మోసగాళ్లు ఉపయోగించుకున్నారు. తమ టాక్స్ పేయర్లను గత 50 ఏళ్లుగా దోచుకున్నారు. ఇక అది జరగదు. మాపై సుంకాలు విధించే దేశాలపై తప్పకుండా సుంకాలు విధిస్తాం. అమెరికాకు ఈ రోజు నిజమైన ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చింది.

**పలు దేశాల దిగుమతులపై ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాలు ఇవే..**

| | |
|---|---|
| భారత్: 26 శాతం | దక్షిణాఫ్రికా: 30 శాతం |
| చైనా: 34 శాతం | బ్రెజిల్: 10 శాతం |
| ఈయూ: 20 శాతం | బంగ్లాదేశ్ 37 శాతం |
| తైవాన్: 32 శాతం | సింగపూర్: 10 శాతం |
| జపాన్: 24 శాతం | ఇజ్రాయెల్: 17 శాతం |
| దక్షిణ కొరియా: 25 శాతం | పిలిప్పీన్స్: 17 శాతం |
| | చిలి: 10 శాతం |
| థాయిలాండ్: 36 శాతం | ఆస్ట్రేలియా: 10 శాతం |
| స్విట్జర్లాండ్: 31 శాతం | పాకిస్థాన్: 29 శాతం |
| ఇండోనేషియా: 32 శాతం | టర్కీ: 10 శాతం |
| మలేషియా: 24 శాతం | శ్రీలంక: 44 శాతం |
| కంబోడియా: 49 శాతం | కొలంబియా: 10 శాతం |
| యూకే: 10 శాతం | |

ఇప్పుడు అమెరికా మరింత ఎదగడానికి అవకాశం వచ్చింది. సుంకాల ప్రకటనతో అమెరికాలో మళ్లీ పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయి. కంపెనీలు తిరిగి వెనక్కి వస్తాయి. విదేశీ మార్కెట్లకు ద్వారాలు తెరుస్తాం. అమెరికాలో పోటీతత్వం పెరిగి సరసమైన ధరల్లో వస్తువులు లభిస్తాయి. దీంతో అమెరికా స్వర్ణయుగమవుతుంది. దశాబ్దాలుగా వాణిజ్య అడ్డంకులను అమెరికా తొలగిస్తూ వచ్చింది. కానీ పలు దేశాలు అమెరికా ఉత్పత్తులపై భారీ సుంకాలను విధిస్తూ వచ్చాయి. అనేక దేశాలు అమెరికా మేధో సంపత్తిని దొంగిలించాయి. పలు దేశాలు అన్యాయమైన నియమాలను అవలంభించాయి. అమెరికాలో దిగుమతి అవుతున్న మోటారు సైకిళ్లపై కేవలం 2.4 శాతమే పన్నులు విధిస్తున్నారు. అదే థాయిలాండ్, ఇతర దేశాలు అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న ద్విచక్రవాహనాలపై 60 శాతం, భారత్ 70 శాతం, వియత్నాం 75 శాతం సుంకాలు విధిస్తున్నాయి.

మా కార్లు ఆ దేశాల్లో తక్కువగా అమ్ముడుపోతున్నాయి..

వాణిజ్య విషయానికి వచ్చినప్పుడు కొన్నిసార్లు స్నేహితుడు సైతం శత్రువు కంటే ప్రమాదకరం. దక్షిణ కొరియాలో తయారవుతున్న కార్లు 80 శాతం అక్కడే అమ్ముడవుతున్నాయి. జపాన్‌లో తయారవుతున్న కార్లు అక్కడే 90 శాతం అమ్ముడుపోతున్నాయి. అదే అమెరికాలో తయారవుతున్న కార్లు అక్కడ తక్కువ సంఖ్యలోనే అమ్ముడవుతున్నాయి. అమెరికాకు చెందిన ఫోర్డు కార్లు ఇతర దేశాల్లో చాలా పరిమిత సంఖ్యలో అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ అసమతుల్యత అమెరికాకు నష్టం తెస్తోంది. అందుకే అన్ని విదేశీ తయారీ ఆటోమొబైల్స్‌పై 25 శాతం సుంకాలు ఈ అర్ధరాత్రి నుంచి విధించనున్నాం. ఇతర దేశాలు అమెరికాను చెడుగా చూపిస్తున్నాయి. అమెరికా దిగుమతులపై అసమానమైన సుంకాలు విధించాయి. అమెరికాలో ఉత్పత్తులు తయారుచేసే కంపెనీలపై ఎలాంటి పన్నులు వసూలు చేయం. తాను ప్రతీకార పన్నుల ప్రతిపాదన తేవడంతో అనేక దేశాల రాజులు, రాయబారులు వీటిపై స్పందించారు. పన్నులపై మినహాయింపులు కోరారు. అయితే మీరు సుంకాలు తగ్గిస్తేనే తాను తగ్గిస్తానని చెప్పాను. కరెన్సీని మార్చుకోవద్దని, బిలియన్ డాలర్ల అమెరికా వస్తువులను కొనాలని చెప్పానని" అని ట్రంప్ పేర్కొన్నారు.

# మీ మంత్రివర్గంలో 46 శాతం బీసీలు ఉన్నారా?

- మొదటి పేజి తరువాయి

అసలైన బీసీ ద్రోహి. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీయే ఇప్పుడు రేవంత్ వెనకుండి ఈ డ్రామాలు ఆడిస్తున్నారు. ఒక బీసీ వ్యక్తి ప్రధాని అయితే జీర్ణించుకోలేక మోదీని రాహుల్ గాంధీ తూలనాడిన విషయాన్ని బీసీలు ఇంకా మరచిపోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలో బీసీల జనాభా 46% అని చెప్తున్నారు. కానీ మంత్రివర్గంలో 46 శాతం బీసీలు ఉన్నారా? సగానికి పైగా ఉన్న బీసీలకు మీరిచ్చిన మంత్రి పదవులు రెండంటే రెండే. దీనిని బట్టే తెలుస్తుంది బీసీల మీద వారికి ఎంత ప్రేమ ఉందో. ప్రత్యేక ఎంబీసీ మంత్రిత్వశాఖ అన్నారు, ఏమైంది? మోదీ ప్రభుత్వం బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తోంది" అని కిషన్‌రెడ్డి తెలిపారు.

**42 శాతం అమలు బాధ్యత రాష్ట్రానిదే: కేంద్ర మంత్రి బండి సంజయ్**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 ప్రకారం ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం సొంతంగా డెడికేటెడ్ కమిషన్ వేసుకుని చట్ట ప్రకారం బీసీ రిజర్వేషన్లు అమలు చేసుకునే అధికారం ఉందని తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజార్టీ ఉంది. భారాస మద్దతు కూడా ఉంది. రిజర్వేషన్లను అమలు చేసుకునే అధికారం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉంది కదా. భాజపాపై ఎందుకు నెపం నెడుతున్నారు. ఇది ముమ్మాటికీ పలాయనవాదమే. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోంది. కాంగ్రెస్ రూపొందించిన 42 శాతం రిజర్వేషన్ బిల్లులో 10 శాతం మంది ముస్లింలే ఉన్నారు. అంటే ఈ బిల్లుతో బీసీలకు అదనంగా దక్కేది కేవలం ఐదు శాతమే. ఈ లెక్కన బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేసినట్లా.?

**బీసీ గర్జన రాజకీయ డ్రామా: కె.లక్ష్మణ్**

బీసీ గర్జన పేరుతో దిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన ధర్నా పూర్తిగా రాజకీయ డ్రామా అని భాజపా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ విమర్శించారు. ఇది బీసీ గర్జన కాదని..కాంగ్రెస్ మాయాగర్జన అని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నిలబెట్టుకోలేకపోయిందని విమర్శించారు. బీసీలను మళ్లీ మభ్యపెట్టేందుకు దిల్లీ వేదికగా ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు.

# నేను ఏది నమ్ముతానో అదే పాటిస్తాను

- మొదటి పేజి తరువాయి

నేను ఏది నమ్ముతానో అదే పాటిస్తాను" అని స్పష్టం చేశారు. "ఉప ఎన్నికల్లో మీరు చూసిన తెగువకు, ధైర్యానికి హాట్సాఫ్. మొత్తం 50 చోట్ల ఎన్నికలు జరిగితే, 39 స్థానాలు వైఎస్సార్‌సీపీ గెలిచింది. కార్యక ర్తలు తెగింపు చూపారు. తెలుగుదేశం పార్టీకి ఈ స్థానా ల్లో ఎక్కడా గెలిచే నంబర్లు లేవు. వారికి సంఖ్యా బలం లేనే లేదు. కానీ... భయాందోళనల మధ్య ఈ ప్రభు త్వం ఎన్నికలు నిర్వహించాలనుకుంది. పోలీసుల తో భయపెట్టి, బెదిరించారు. ఇన్ని సంవత్సరాలు ముఖ్య మంత్రిగా ఉన్నానని చెప్పుకుంటున్న చంద్రబాబుకి బుద్ధిలేదు. వాస్తవంగా ఈ ఎన్నికలను టీడీపీ వదిలే యాలి. కానీ అధికార అహంకారంతో ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని చూశారు. నిజంగా ఇది ధర్మమే నా? న్యాయమేనా?" అని ప్రశ్నించారు. తిరుపతి మున్సిపల్ ఉప ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, విశా ఖపట్నంలో అవిశ్వాస తీర్మానం ద్వారా అక్రమాలకు పాల్పడుతున్నారని జగన్ ఆరోపించారు. రామగిరిలో 10కి తొమ్మిది ఎంపీటీసీ స్థానాలు వైసీపీ గెలుచుకున్నా ఎన్నికలు జరగకుండా అడ్డుకుంటున్నారని, పోలీసులే ఎంపీటీసీలను కిడ్నాప్ చేస్తున్నారని ఆయన అన్నారు. బీసీ నాయకుడు లింగమయ్యను చంపేశారని ఆరోపించారు. ప్రతి నియోజకవర్గంలో చంద్రబాబు ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నారని జగన్ విమర్శించారు.కుప్పంలో 16 ఎంపీటీసీ స్థానాలకు గాను 16 స్థానాలు వైసీపీ గెలుచుకుందని, అయితే ఆరుగురిని ప్రలోభాలకు గురిచేసి తీసుకెళ్లారని, మిగి లిన 9 మందిని ఎన్నికల కేంద్రానికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారని జగన్ ఆరోపించారు. కోరం లేకున్నా గెలిచినట్లు ప్రకటించుకున్నారని ఆయన విమర్శించారు.రాబోయే రోజుల్లో వైసీపీ అఖండ మెజార్టీతో గెలుస్తుందని, కార్యకర్తల కోసం కచ్చితంగా పార్టీ నిలబడుతుందని జగన్ అన్నారు. కోవిడ్ కారణంగా కార్యకర్తలకు తాను చేయాల్సింది చేయలేక పోయానని, జగన్ 2.0లో కార్యకర్తల కోసం గట్టిగా నిలబడతానని హామీ ఇచ్చారు.

# 50 ఏళ్ల అవసరాలకు తగ్గట్లు తితిదేను తీర్చిదిద్దాలి

తిరుమలకు భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో.. వచ్చే 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా తితిదేను తీర్చిదిద్దాలని.. భక్తులకు అందించే సేవలు, సౌకర్యాల్లో 100 శాతం మార్పు కనిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అవసరమైన పనులు మాత్రమే చేయాలని, శ్రీవారి సొమ్మును ఇష్టారీతిన ఖర్చుపెట్టొద్దని స్పష్టం చేశారు. మనం ధర్మకర్తలం, నిమిత్తమాత్రులమేనని.. స్వామివారికి భక్తులు కానుకల రూపంలో ఇచ్చే డబ్బును ఇష్టారీతిన ఖర్చు పెట్టే అధికారం ఎవరికీ లేదని తేల్చిచెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానాలపై సీఎం చంద్రబాబు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరితోపాటు ఉన్నతాధికారులతో బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. 'తితిదే రూ.వందల కోట్ల నిధులను అనేక కార్యక్రమాలకు ఖర్చు చేస్తోంది. అందులో ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకూడదు. అంతర్గత ఆడిట్‌తోపాటు, కాగ్ ద్వారా కూడా ఆడిట్ జరిపించాలి. భక్తులు విరాళంగా ఇచ్చే ప్రతి రూపాయికీ జవాబుదారీతనం ఉండాలి' అని ఆదేశించారు.

'తితిదేలో సమూల ప్రక్షాళన చేస్తామని ఎన్నికల ముందు చెప్పాను. అధికారంలోకి వచ్చాక మార్పులు చేశాం.ఇంకా 100 శాతం మార్పులు ఉండాలి. ఎక్కడా పాత వాసనలు, పాత వ్యక్తులు ఉండకూడదు. అనుభవజ్ఞుల పేరుతో పాతవారెవరినీ ఎట్టి పరిస్థితుల్లోనూ కొనసాగించొద్దు. జేఈవో, చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీవీఎస్‌వో), ఎస్వీబీసీ ఛైర్మన్, బర్డ్ ఆసుపత్రి డైరెక్టర్ల నియామకం త్వరలో చేపడతాం' అని సీఎం తెలిపారు. 'తితిదేకి చెందిన 15 రకాల సేవలను వాట్సప్ ద్వారా అందించే కార్యక్రమం వెంటనే ఆరంభించాలి. ప్రతి సేవకు ఆధార్, ఫోన్ నంబరును అనుసంధానిస్తే అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చు. పారిశుద్ధ్య నిర్వహణపైనా ప్రత్యేక దృష్టి సారించాలి. తిరుమలలో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు అన్ని అవకాశాలను వినియోగించుకోవాలి. తితిదే పరిధి 2,675 హెక్టార్లలో విస్తరించి ఉండగా, అందులో 68.14 శాతమే పచ్చదనం ఉంది. దీనికి 80 శాతానికి పెంచాలి'

అని చంద్రబాబు ఆదేశించారు. శ్రీవారి సేవకుల్లో 90 శాతం కొత్తవారు ఉంటున్నారని అధికారులు తెలపగా, సగం మంది పాతవారు ఉండేలా చూస్తే నాణ్యమైన సేవలు అందించొచ్చని సీఎం సూచించారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి నిత్యం 25 వేల మంది వరకు భక్తులు వస్తారని అధికారులు వివరించగా.. ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అలిపిరిలో 25 వేల మంది భక్తులకు సౌకర్యంగా ఉండేలా బేస్ క్యాంప్ నిర్మాణం చేపడుతున్నామని, 60 అనుబంధ ఆలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని అధికారులు తెలిపారు.

## శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు ఘన నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఏప్రిల్ -02:**శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఘన నివాళులు అర్పించారు.

బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొని, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి వారి ఆశయ సాధనకు పాటుపడాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా బీసి అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, గౌడ సంఘం నాయకులు మిత్రు గౌడ్, అంజయ్య, ప్రతినిధులు, ఇతర ప్రజా ప్రతినిధులు, కలెక్టరెట్ పరిపాలన అధికారి ఎన్. అరుణ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారి వర్ధంతి.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజుఏప్రిల్ 2.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో గౌడ సంఘం ఆధ్వర్యంలో గౌడ సంఘం అధ్యక్షులు కొండూరు అంజయ్య గౌడ్ సమక్షంలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారి విగ్రహానికి పూలమాలవేసి గౌడ సంఘం సభ్యులు అందరూ కలిసి నివాళులు అర్పించినారు.

గౌడ సంఘం సభ్యులు మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ తొలి రాజు, బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు, మొగలాయి దౌర్జన్యాలను ఎదిరించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడినారు.

ఈ కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు గౌడ సంఘం సభ్యులు అధ్యక్షులు కొండూరు అంజయ్య గౌడ్, ఉపాధ్యక్షులు బత్తిని దేవేందర్ గౌడ్ కార్యదర్శి పబ్బు స్వామి గౌడ్,మరియు మాజీ సర్పంచ్ పబ్బు ఉపేందర్ గౌడు, కొండూరు వెంకన్న గౌడ్,బంధారపు లింగస్వామి గౌడ్ , కాసుల వెంకన్న గౌడ్, బత్తిని సత్యనారాయణ గౌడ్,పంజాల రమేష్ గౌడ్, కొండూరు సత్తయ్య గౌడ్, పాలకుర్లా వెంకటేశం గౌడ్, మారగొని నరసింహ గౌడ్, బత్తిని సహదేవు గౌడ్, పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసంలో జర్నలిస్టులకు ప్రాధాన్యం

- టీడబ్ల్యూజేఎఫ్ వినతిపై జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ స్పందన
- మంచి ఆలోచనని టీడబ్ల్యూజేఎఫ్ కు కలెక్టర్ అభినందనలు
- అదనపు కలెక్టర్ శ్రీజాకు జాబితా ఇవ్వాల్సిందిగా సూచన



**సి కె న్యూస్ ప్రతినిధి:** రాజీవ్ యువ వికాసం పథకంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ హామీ ఇచ్చారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ ఐడీవోసీలో బుధవారం అందజేసిన వినతిపత్రంపై కలెక్టర్ స్పందించారు. మంచి సూచన చేశారంటూ టీడబ్ల్యూజేఎఫ్ నేతలను అభినందించారు. అప్లికేషన్ చేసుకుని జాబితాను జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజాకు ఇస్తే ఆమె వాటిని పరిశీలించి అర్హులైన జర్నలిస్టులకు పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటారన్నారు. నిరుద్యోగులకు ఉద్దేశించిన పథకంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వటం సముచితమన్నారు. జర్నలిస్టులు పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారు కాబట్టి వారి ఆర్థిక స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని మేలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. టీడబ్ల్యూజేఎఫ్ సూచన మేరకు అల్పాదాయ వర్గాలకు చెందిన జర్నలిస్టులకు రాజీవ్ యువ వికాసంలో ప్రాధాన్యత ఇస్తామన్నారు. జర్నలిస్టులు దరఖాస్తు చేసుకొని, అప్లికేషన్ నంబర్ టీడబ్ల్యూజేఎఫ్ నేతలకు సమర్పిస్తే వారు ఆ వివరాలను అదనపు కలెక్టర్ కు అందజేస్తారన్నారు. రాజీవ్ యువ వికాసంలో ఎక్కువ మంది జర్నలిస్టులకు లబ్ధి చేకూర్చేలా చూస్తామన్నారు. కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్, ఖమ్మం జిల్లా కమిటీ కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, నేతలు సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, కూరాకుల గోపీ, ఆవుల శ్రీనివాస్, వేగినాటి మాధవ్, షేక్ జానీపాష, మధుశ్రీ, దేవేందర్, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, అర్షద్, గణేశ్, ఫయాజ్, జాకీర్, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

## యువ వికాసం అమలుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.....

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఏప్రిల్ 14 వరకు యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ
- మండల కార్యాలయాల్లో ఆన్ లైన్ దరఖాస్తుల నమోదుకు సహాయకుల ఏర్పాటు
- లాభదాయకమైన యూనిట్లు ఏర్పాటు చేసేలా అవగాహన కల్పించాలి
- రాజీవ్ యువ వికాసంపై మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఏప్రిల్ -02 :**యువ వికాసం అమలుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.

బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, రాజీవ్ యువ వికాసంపై అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులతో కలిసి మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ వివిధ కార్పొరేషన్ల క్రింద 50 వేల నుంచి 4 లక్షల రూపాయల వరకు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు కొరకు రాజీవ్ యువ వికాసం పథకం క్రింద దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అన్నారు.

ఏప్రిల్ 14 వరకు రాజీవ్ యువ వికాసం పథకం క్రింద ఓబిఎంఎంఎస్ పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఎంపిడిఓ, తహసిల్దార్ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ను మంచి కంప్యూటర్, ఇంటర్నెట్ కనెక్షన్ తో ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఆన్ లైన్ దరఖాస్తు చేసుకునేందుకు సహకారం అందించాలని అన్నారు.

గ్రామాలలో రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన డాక్యుమెంట్ లపై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. ఆధార్, కుల ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రం (గ్రామీణ ప్రాంతాల్లో లక్షన్నర లోపు, పట్టణ ప్రాంతాలలో 2 లక్షల లోపు) మొదలైనవి అవసరమని అన్నారు.

తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన కుల ధృవీకరణ పత్రాలు మాత్రమే యాక్సెప్ట్ చేయడం జరుగుతుందని, లబ్దిదారులకు అర్హత ఉంటే తహసిల్దార్ ఫాస్ట్ ట్రాక్ లో అవసరమైన సర్టిఫికెట్ జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. లబ్దిదారులకు అవసరమైన బ్యాంకు ఖాతాలు ప్రారంభించాలని అన్నారు.

మనకు వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి ప్రాక్టికల్ గా నడిచే యూనిట్ల స్థాపనకు చర్యలు తీసుకోవాలని అన్నారు. లబ్దిదారులకు నడిచే యూనిట్లపై ప్రచారం కల్పించాలని అన్నారు. ప్రజావాణి తరువాత సమావేశం నిర్వహించి దరఖాస్తుల స్క్రూటిని, చేపట్టాల్సిన చర్యల పై చర్చించాలని అన్నారు.

సెక్టార్ స్పెసిఫిక్ యూనిట్ లను సంబంధిత అధికారులు తప్పనిసరిగా సర్టిఫై చేయాలని కలెక్టర్ తెలిపారు. ఏప్రిల్ 14 తర్వాత రాజీవ్ యువ వికాసం క్రింద వచ్చిన దరఖాస్తులు, ప్రతి మండలంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను సరి చూసుకుని స్క్రూటినీ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

మండల స్థాయిలో ధృవీకరించిన దరఖాస్తులలో కొంత శాతం జిల్లా స్థాయి అధికారులు మరొకసారి పర్యవేక్షిస్తారని కలెక్టర్ తెలిపారు. జూన్ నెల నాటికి యూనిట్ల గ్రౌండింగ్ కోసం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

రాజీవ్ యువ వికాసం పథకం కోసం సంబంధిత లబ్ధిదారులు లేదా కుటుంబ సభ్యులు మాత్రమే దరఖాస్తు చేయాలని, ఇతరులు దరఖాస్తు చేయడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. పబ్లిక్ తో ఇంటరాక్ట్ అయ్యే సమయంలో ఓపిక ఉన్న అధికారులను పెట్టాలని అన్నారు.

ఈ సమావేశంలో డిఆర్డీవో సన్యాసయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఇంచార్జ్ ఇడి నవీన్ బాబు, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి ఎన్. విజయలక్ష్మీ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి డా. బి. పురంధర్, ఎల్డిఎం శ్రీనివాస రెడ్డి, బ్యాంక్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి.....



- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- రాజీవ్ యువ వికాసం, సన్న బియ్యం సరఫరాపై మీడియా సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఏప్రిల్ - 02:**రాజీవ్ యువ వికాసం పథకాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.

బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి రాజీవ్ యువ వికాసం, సన్న బియ్యం సరఫరాపై మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఏప్రిల్ 14 వరకు రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఆన్ లైన్ లో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని లేదా ఎంపీడీవో కార్యాలయం, మున్సిపల్ కార్యాలయ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

50 వేల నుంచి 4 లక్షల రూపాయల వరకు సబ్సిడీ యూనిట్లు లభిస్తాయని అన్నారు. అభ్యర్థులకు వ్యవసాయేతర యూనిట్లకు 21 నుంచి 55 ఏళ్ళ వయస్సు ఉండాలని, వ్యవసాయ యూనిట్లకు 60 సంవత్సరాల వరకు సడలింపు ఉందని కలెక్టర్ తెలిపారు. ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ లేదా ఆధాయ ధృవీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రంతో కలిపి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థులకు అవసరమైన సర్టిఫికెట్లు వెంటనే 3 రోజులలో జారీ చేసేలా తహసీల్దార్ లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

మండల జనాభా, గ్రామ జనాభా అనుగుణంగా కేటాయించిన లక్ష్యాల ప్రకారం యూనిట్లను మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. స్క్రూటినీ యూనిట్ లో స్పెషలిస్ట్ అధికారులను సైతం ఉంచుతామని అన్నారు. సెక్టార్ వారీగా అభ్యర్థులకు అవసరమైన శిక్షణ కూడా అందించడం జరుగుతుందని అన్నారు.

డాక్యుమెంట్ కారణంగా ఎవరికి యూనిట్ ఆపడం జరగదని కలెక్టర్ తెలిపారు. బ్యాంక్ లింకేజీ రుణాలు కూడా తప్పనిసరిగా మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలు అనవసరంగా తిరస్కరించడానికి వీలు లేదని అన్నారు. అభ్యర్థులకు అవసరమైన శిక్షణ అందించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు.

ప్రతి రేషన్ షాపులో తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ఉచితంగా సన్న రకం బియ్యం సరఫరా చేయడానికి చర్యలు చేపట్టామని అన్నారు. రేషన్ డీలర్ల ఓనర్ షిప్ రీ-వెరిఫికేషన్ చేస్తామని, సరిగ్గా పని చేయని రేషన్ డీలర్లపై తప్పనిసరిగా చర్యలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు.

రేషన్ బియ్యం పక్కదారి పట్టడానికి వీలు లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. లబ్దిదారులకు ఎవరైనా సన్న బియ్యం కాకుండా నాణ్యత లేని బియ్యం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఈ సమావేశంలో డిఆర్డీవో సన్యాసయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఇంచార్జ్ ఇడి నవీన్ బాబు, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎన్ విజయలక్ష్మీ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి డా. బి. పురంధర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదలు నివారణకు చర్యలు వేములపల్లి ఎస్సై డి.వెంకటేశ్వర్లు



**వేములపల్లి సికే న్యూస్ ప్రతినిధి ఏప్రిల్ 2**
రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని వేములపల్లి ఎస్సై డి వెంకటేశ్వర్లు తెలిపారు.బుధవారం బుగ్గబావిగూడెం,శెట్టిపాలెం,వేములపల్లిలో రోడ్డు భద్రత కమిటీతో బ్లాక్ స్పాట్లను గుర్తించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు.రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించామన్నారు.బ్లాక్ స్పాట్ ఏరియాలను గుర్తించి రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.రాత్రి సమయంలో రహదారిపై వాహనాలు నిలిపి ఉండడం వలన ఎక్కువ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.రోడ్డు వెంట ఉన్న గ్రామ ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణ పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. వాహనదారులు ప్రజలు ప్రమాదాలను బారిన పడకుండా జాగ్రత్తలు పాటిస్తూ ఉండాలన్నారు.ఎస్ఐ వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఏప్రిల్ నెలాఖరు నాటికి మండల కార్యాలయాలను ప్లాస్టిక్ రహితం చేయాలి....

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- క్రమపద్ధతిలో ప్రభుత్వ కార్యాలయాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలి
- చలివేంద్రాల సమర్థ నిర్వహణకు చర్యలు
- ప్లాస్టిక్ నియంత్రణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఏప్రిల్ -02 :**ఏప్రిల్ నెలాఖరు నాటికి మండల కార్యాలయాలను ప్లాస్టిక్ రహితం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.

బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ప్లాస్టిక్ నియంత్రణపై అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మండలాల్లో తహసిల్దార్, ఎంపిడిఓ కార్యాలయాలు ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఏప్రిల్ తర్వాత మండల స్థాయి కార్యాలయాల్లో ఎక్కడా ప్లాస్టిక్ వాడ వద్దని కలెక్టర్ తెలిపారు.

మండలంలో కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన చలి వేంద్రాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతి రోజు త్రాగునీటి సరఫరా నాణ్యత తనిఖీ చేయాలని అన్నారు. గ్రామాలలో, మున్సిపాలిటీలలో బస్ స్టాప్, ఆటో స్టాండ్ ల వద్ద తప్పనిసరిగా చలివేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలతో ఇంటరాక్ట్ అయ్యే సమయంలో అధికారులు ఓపికతో ఉండాలని అన్నారు.

ఈ సమావేశంలో డిఆర్డీవో సన్యాసయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఇంచార్జ్ ఇడి నవీన్ బాబు, బిసి సంక్షేమ అధికారి జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మీ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి డా. బి. పురంధర్, ఎల్డిఎం శ్రీనివాస రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## పీపీఎస్ ఆధ్వర్యంలో కళ్ళజోళ్ళ పంపిణీ!



**పలమనేరు నియోజకవర్గం ఏప్రిల్ 2 సి కె న్యూస్:**పలమనేరు పర్యవేక్షణ సమితి ఆధ్వర్యంలో గత 15 రోజుల మునుపు తిరుపతికి చెందిన అమెరికన్ ఐ హాస్పిటల్ వారి సహకారంతో స్థానిక ఎన్జీవో హోం నందు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం నందు ఎంపికైన 60 మందికి వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేపట్టిన పిదప బుధవారం హాస్పిటల్ నుండి విచ్చేసిన ప్రత్యేక వైద్య బృందం శస్త్ర చికిత్స చేసిన వారందరినీ మరొకసారి పరీక్షలు నిర్వహించి వారందరికీ కళ్ళజోళ్ళు ఉచితంగా పంపిణీ చేయడానికి కావలసిన కొలతలను సేకరించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో పిపిఎస్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం పిళ్ళై, ఎన్జీవో సంఘం అధ్యక్షులు ఆనందబాబు, పిపిఎస్ కార్యదర్శి నరసింహులు, కోశాధికారి సన్నీ రాజు, నారాయణ, దొరస్వామి, సాంబయ్య, విజయ్ కుమార్ రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రామనవమికి భద్రాచలం వస్తున్న ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు...

- భద్రాచలం అభివృద్ధిపై స్పష్టమైన ప్రకటన చేయాలి.
- సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 02,**పోలవరం బ్యాక్ వాటర్ తో భద్రాచలం ముంపు సమస్య పై కేంద్రం పై ఒత్తిడి తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత తీసుకొని అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని,ఐదు పంచాయతీలను తెలంగాణ లో కలిపేందుకు కేంద్రంతో,ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్చించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ జే రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీరామనవమికి భద్రాచలం విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, మరియు కేంద్ర బిజెపి మంత్రులు భద్రాచలం పట్టణ సమస్యలపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతూ భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టడం జరిగింది. నిరాహార దీక్షను లైన్స్ క్లబ్ అధ్యక్షులు సిహెచ్ రామలింగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏజె రమేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భద్రాచలం పట్ల కక్షపూరిత ధోరణితో ఉన్నదని, గత 10 ఏండ్ల క్రితం పోలవరం ప్రాజెక్టు పేరుతో భద్రాచలం నియోజకవర్గం లోని 4 మండలాలను ఆంధ్రలో కలిపి తీవ్ర అన్యాయం చేసిందని, నేడు భద్రాచలం పట్టణాన్ని పోలవరంలో ముంచేందుకు పోలవరం ఎత్తు పెంచి నిర్మాణం చేసుకునే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అనుమతులు ఇచ్చి, నిధులు కేటాయించడం దారుణమని అన్నారు. భద్రాచలం పట్ల కేంద్ర బిజెపి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందని అన్నారు. పోలవరం బ్యాక్ వాటర్ తో భద్రాచలం ముంపు పై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో రీ సర్వే చేసి నిర్దిష్ట అంచనా వేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రాలో కలిపిన 5 పంచాయతీల ను తెలంగాణలో కలపడానికి కృషి చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిందని,ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తోనూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తోనూ చర్చించేందుకు సత్వరమే కార్యాచరణ ప్రకటించాలని అన్నారు.

రామాలయం అభివృద్ధితోపాటు భద్రాచలం పట్టణ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, కరకట్ట ఇరువైపులా ఎత్తు పెంచి పొడిగించేందుకు ఇంజనీరింగ్ నిపుణులతో అంచనాలు వేసి కావలసిన నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సుభాష్ నగర్ కాలనీ వైపు కరకట్ట పొడిగింపు నిర్మాణ పనులు సత్వరమే పూర్తి చేయాలని అన్నారు.నాలుగు రాష్ట్రాలకు కేంద్రంగా భద్రాచలం పట్టణంలో ఉన్న ఏరియా హాస్పిటల్ ను సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ గా అప్ గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. నిత్యం రాముని జపం చేస్తున్న బిజెపి ప్రభుత్వం దక్షిణ అయోధ్యగా పిలవబడుతున్న భద్రాచలం పట్ల తీవ్ర నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందని ఆయన దుయ్య బట్టారు. భద్రాచలం రామాలయాన్ని రామాయణం సర్క్యూట్ లో చేర్చాలని, భద్రాచలం కు రైల్వే లైన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, సున్నం గంగ, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పి సంతోష్ కుమార్ డి సీతాలక్ష్మి పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి, యు జ్యోతి, ఎస్ డి ఫిరోజ్, జీవనజ్యోతి, చాట్ల శ్రీనివాస్, ఎస్ భూపేంద్ర, కోరాడ శ్రీనివాస్, దనకొండ రాఘవయ్య, కుంజ శ్రీనివాస్, చుక్క మాధవరావు, శాఖ కార్యదర్శులు సీత, కాకా రమణ, పుణ్యవతి, జి నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),ఏప్రిల్ 02,**

శ్రీ సీతారామ చంద్రస్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించడానికి భద్రాచలానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అన్ని శాఖల అధికారులు వారికి అప్పగించిన పనులను బాధ్యత గా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ అన్నారు. బుధవారం భద్రాచలం లోని సబ్ కలెక్టర్ కార్యాలయం లోని సమావేశ మందిరంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవ వేడుకలు విజయవంతం అవ్వడానికి సంబంధిత శాఖల అధికారుల తరఫున జరుగుతున్న ఏర్పాట్లపై శాఖల వారీగా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత వైభవోపేతంగా ఎక్కడా లేని విధంగా సీతారాముల వారి కళ్యాణం జరిగేటువంటి పవిత్ర స్థలం మన భద్రాచలం పుణ్యక్షేత్రమని అన్నారు. ఈ క్షేత్రంలో కొన్ని దశాబ్దాల తరబడి సీతారాముల వారి కళ్యాణం ఆనవాయితీగా జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు.

కళ్యాణమహోత్సవాన్ని ప్రత్యేకంగా కానీ పరోక్షంగా వీక్షించిన భక్తులకు ఎంతో పుణ్యం వస్తుందని వేదాల్లో చెప్పడం జరిగిందని అన్నారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున పూర్తి స్థాయి లో భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మంచినీరు, చలువ పందిళ్లు, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఫాగ్ లిస్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు కళ్యాణ వేడుకలు వీక్షించేందుకు 26 సెక్టార్లు ఏర్పాటుతో పాటు ప్రతి సెక్టార్ లో ఎల్ ఈ డి టివిలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కల్యాణ వేడుకలకు విచ్చేయు భక్తులకు స్వామి వారి కళ్యాణ వేడుకలు వీక్షించి జన్మ జన్మల పుణ్యాన్ని పొందేలా అధికారులు కృషి చేయాలని ఆయన అన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం పట్టాభిషేకం మహోత్సవాన్ని పురస్కరించుకొని దేవస్థానం తరపున మార్చి 30 నుండి ఏప్రిల్ 12 వ తారీకు వరకు బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనాయని, కళ్యాణం జరిగే ముందు రోజు స్వామివారి ఎదుర్కోళ్ల కార్యక్రమం ఉంటుందని, భక్తుల సౌకర్యార్థం 75% ఆన్లైన్లో టికెట్లు అందుబాటులో ఉంచామని, భక్తులకు లడ్డు ప్రసాదంతో పాటు మహా ప్రసాదం కూడా అందించడానికి ప్రణాళికలు రూపొందించామని, తలంబ్రాల కౌంటర్లు 80 వరకు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి ఆర్టీసీ బస్సులో భక్తులకు కేజీ చొప్పున తలంబ్రాలు అందిస్తున్నామని, సేవల ద్వారా ఆర్టీసీ, పోస్ట్ ఆఫీస్ ద్వారా బుక్ చేసుకున్న వారికి ఇండియన్ ప్రకారం అందిస్తామని అన్నారు. సీఎం రాక కోసం మూడు హెలిప్యాడ్లను సిద్ధం చేస్తున్నామని ఆర్డబ్ల్యూఎస్ మెడికల్ డిపార్ట్మెంట్ ద్వారా అక్కడ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, కళ్యాణం మరియు పట్టాభిషేకం జరిగే రెండు రోజులు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, జనరేటర్ ను కూడా మిథిలా స్టేడియంలో అందుబాటులో ఉంచుకుంటున్నామని, ఆర్డబ్ల్యూఎస్ ద్వారా భక్తులకు, పార్కింగ్ ఏరియాలలో మరియు సెక్టార్లలో మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్నామని, గ్రామ పంచాయతీ ద్వారా శానిటేషన్ తో పాటు భద్రాచలంలోని 25 పాయింట్లు మంచినీటి సౌకర్యంతో పాటు, 15చోట్ల 162 టాయిలెట్లు, మూడు మొబైల్ టాయిలెట్లు ఏర్పాట్లు చేశామని, 560 మంది సిబ్బంది అందుబాటులో ఉంచుకున్నామని అన్నారు. భక్తులు గోదావరి లోకి వెళ్లకుండా భారీ కేడింగ్ ఏర్పాటు చేశామని, లైఫ్ జాకెట్లు, లైఫ్ బాల్స్, 20 మంది గజ ఈతగాళ్లను, రిస్క్ బోట్స్ 15, గోదావరిలో ప్రమాద సూచికలను ఏర్పాట్లు చేసి ప్రజలు ఎవ్వరు గోదావరి లోపల వెళ్లకుండా ప్రత్యేక నిగా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అగ్నిమాపక శాఖ ద్వారా భద్రాచలం పట్టణంలోని ముఖ్యమైన కూడళ్లలో కళ్యాణం జరుగు ప్రదేశాలలో ఆరు ఫైరింజన్లు ఏర్పాట్లు చేస్తున్నామని, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా భద్రాచలం, పర్ణశాల, హెలిపాడ్, వాహనాల పార్కింగ్ స్థలాలలో కలుపుకొని 13 మెడికల్ క్యాంపులు, 05 అంబులెన్సులు,30 మంది ఫీల్డ్ స్టాఫ్, ఏరియా ఆసుపత్రి లో ప్రత్యేక వార్డు ఐసీయూ 24 గంటలు పని చేసే అంబులెన్స్ తో పాటు ఓఆర్ఎస్ పాకెట్లు అన్ని జబ్బులకు మందులు అందుబాటులో ఉంచుతున్నామని, ఎక్సైజ్ శాఖ ద్వారా 6, 7 తేదీలలో బార్ షాపులు మరియు బెల్టు షాపులు అన్నింటిని క్లోజ్ చేస్తామని, నాలుగు చోట్ల మొబైల్ చెక్పోస్టులు ఏర్పాటు చేసి గట్టిగా పెడుతున్నామని అన్నారు.

అధికారులు భక్తులు మాత్రమే స్వామి వారి కళ్యాణం వీక్షించే విధంగా చూడాలని, కుటుంబ సభ్యులకు గానీ, బంధువులకు గాని ప్రాధాన్యత ఇవ్వకూడదని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జేసి వేణుగోపాల్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్, ఏ ఎస్ పి విక్రాంత్ కుమార్ సింగ్, ఆర్డీవో దామోదర్ రావు, దేవస్థానం ఈవో రమాదేవి మరియు వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

- వర్ధంతి సందర్బంగా నివాళులుర్పించిన పల్లెర్ల గౌడ సంఘం నాయకులు





**సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్ :**ఆత్మకూర్(ఎం) ఏప్రిల్ 2 బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315 వ వర్ధంతి సందర్భంగా పల్లెర్ల గ్రామ గౌడ్ సంఘం ఆధ్వర్యంలో వారి విగ్రహం వద్ద నివాళులుర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజన పోరాట యోధుడు, సబ్బండ వర్గాలకు రాజకీయ,సామాజిక సమానత్వం కోసం పాటుపడిన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ ఆమహనీయుడికి ఇవేమనివాళి వారి ఆశయ సాధనకై అడుగులు వేస్తూ వారి పోరాట స్ఫూర్తితో ముందుకు వెళ్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు నోముల లక్షమయ్య గౌడ్ ఉపాఅధ్యక్షులు లోడి శ్రీహరి గౌడ్ , కార్యదర్శి నోముల కిష్టయ్య గౌడ్ పెదగాని వెంకన్న గౌడ్ లోడి నాగరాజు గాడ్ నోముల శేఖర్ గౌడ్ నోముల దేవయ్య గౌడ్ లోడి వెంకన్న గౌడ్ తండ మచ్చగిరి గౌడ్ గౌడ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

# శ్రీ సీతారాముల స్వామి వారి లగ్న పత్రిక ఆవిష్కరణ.

**గుడి చైర్మన్ గంధ మల్ల గోపాల్ మరియు గ్రామ పెద్దల సమక్షంలో.**





**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఏప్రిల్ 2.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని లింగరాజు పల్లి గ్రామంలో, ఈనెల 6 వ తారీకున శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించబడునని గ్రామ పెద్దలు గుడి చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ,

శ్రీ విశ్వావసు నామ సంవత్సర 06/04/2025 రోజున లిశ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండగ లింగరాజు పల్లి గ్రామంలో గ్రామపంచాయతీ ముందు జరగనుంది.

గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రతి సంవత్సరం మన గ్రామంలో జరిపించే శ్రీ సీతారాముల కళ్యాణం ఈసారి కూడా 06/04/2025 రోజున ఉదయం 10:00 గంటలకులి పురోహితులు

శ్రీ నందిపట్ల లక్ష్మీనారాయణ శాస్త్రి

శ్రీ నంది పట్ల శ్రీకర్ శాస్త్రి గార్లు ఎంతో కనుల పండగ గా సీతారాముల కల్యాణ మహోత్సవం జరిపించనున్నారు, గ్రామ ప్రజలందరూ పంతులు చెప్పిన టైం కంటే ముందుగా కళ్యాణ మండపం దగ్గరికి వచ్చి వారికి తోచిన నంత డబ్బులు బియ్యం లేదా కళ్యాణ మండపంలో ఏదో ఒక పని సహాయం చేయవలసిందిగా కోరుతున్నాం కళ్యాణం అనంతరం

భోజన తాంబూలాలు స్వీకరించగలరు అలాగే సాయంత్రం 5:00 గంటలకులి ఆటపాటలతో ఉత్సవమూర్తులని ఊరేగింపు కార్యక్రమం ఉంటుందనీ

ఈ కార్యక్రమంలో ప్రతి బజార్ కు ఆడ మగ అందరూ భజనతో భక్తి పాటలతో ఆ భగవంతున్ని తీసుకపోవలసిందిగా మనవి. ఈ కార్యక్రమం మన లింగరాజుపల్లి గ్రామ ప్రజల అందరిది ఈ దైవ కార్యక్రమాన్ని గ్రామస్తులందరూ సంతోషంగా ఆనందంగా ఉత్సాహంగా పాల్గొని ఆ భగవంతుని కృపకు పాత్రులు కాగలరని కోరుకుంటు లింగరాజు పల్లి

శ్రీ సీతారాముల ఉత్సవ కమిటీ సభ్యులు మీడియా ద్వారా గ్రామ ప్రజలకు తెలిపినారు.

ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఆహ్వానం శుభ పత్రికను అందజేసినారు.

# ఈ నెల 6వ తారీఖున శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం విజయవంతం చేయాలి.

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యులు గంధ మల్ల బాలయ్య మల్లమ్మ గౌడ్.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఏప్రిల్ 2.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని లింగరాజు పల్లి గ్రామంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు గంధ మల్ల బాలయ్య గౌడ్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్లగొండ జిల్లా మహిళ విభాగం అధ్యక్షురాలు,గంధమల్ల మల్లమ్మ మీడియాతో మాట్లాడుతూ, ఈనెల 6వ తారీఖున లింగరాజు పెల్లి గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరుగునని, కావున భక్తులంతా విచ్చేసి కళ్యాణ మహోత్సవము తిలకించి, స్వామివారి మహా ప్రసాదం స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందగలరని మీడియాతో గ్రామ ప్రజలను కోరుతూ మాట్లాడినారు.

# శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న మంత్రి పొంగులేటి దంపతులు



**సికే న్యూస్ ప్రతినిధి,ఖమ్మం :** శ్రీశైల మహాక్షేత్రంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మాధురి దంపతులు బుధవారం ఉదయం దర్శించుకున్నారు. మంత్రి దంపతులకు ఆలయ రాజగోపురం వద్ద అర్చకులు, ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీర్వచన మండపంలో మంత్రి దంపతులకు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు, స్వామివార్ల ఫొటోను అందజేశారు.

# తక్షణమే వేములపల్లి మండల కేంద్రంలో సర్వీస్ రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ కు వినతి పత్రం అందజేత



**వేములపల్లి సీకే న్యూస్ ప్రతినిధి ఏప్రిల్ 2 :**మండల కేంద్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సర్వీస్ రోడ్డు వేయించాలని సిపిఐ మండల కార్యదర్శి జిల్లా యాదగిరి బుధవారం తాసిల్దార్ పుష్పలత కు వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో రోడ్డు విస్తరణలో హైవే రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్డు వేస్తామని చెప్పిన ఆనాటి కాంట్రాక్టర్ సర్వీస్ రోడ్డు నిర్మించకుండానే పెండింగ్లో పెట్టడం తో హైవే పై వెళ్తున్న బాటసారులతో పాటు ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు,హైవే వెంట సర్వీస్ రోడ్డు పై నడవడానికి కూడా చోటు లేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నడుస్తున్నప్పటికీ అవగాహన లేని కొంత మంది డ్రైవర్లు అతివేగంతో అజాగ్రత్తతో వాహనాలను నడుపుకుంటూ ఎంత జాగ్రత్తగా వెళ్తున్నప్పటికీ కార్ల డ్రైవర్లు అతివేగంతో వెళ్తూ జాగ్రత్తగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారులకు బాటసారులను కూడా టక్కర్ చేసుకుంటూ వెళ్లడంతో ప్రమాదానికి గురైన వ్యక్తులు మృతి చెందడంతో పాటు కుటుంబ సభ్యులు వీధిపాలవుతున్నారని ఇప్పటికే ఒక్క నెలలోనే పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని మరి కొంతమంది రోడ్డు పాలు కాకుండా ఉండాలంటే తక్షణమే హైవేకు ఇరువైపులా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు, అధికారులు స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని లేనట్లయితే రాష్ట్రవ్యాప్తంగా బాధిత కుటుంబాలతో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

## పేదలు సైతం పెద్దల మాదిరిగానే సన్న బియ్యం తినాలి

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకులు మామిడి సత్తిరెడ్డి .



**తెలంగాణ పత్రిక వలిగొండ మండలం ఏప్రిల్ 2:** మొగిలి పాక గ్రామములో మామిడి సత్తిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.

సన్న బియ్యం పథకం నిరుపేదల ఆత్మగౌరవ పథకమని,చరిత్రలో నిలిచిపోయే పథకామని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిహయంలో పేదలు సైతం పెద్దల మాదిరిగానే సన్న బియ్యం తినాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులకు 20 లక్షల మందిని రేషన్ కార్డులలో పేర్లు చేర్పించడం జరిగిందన్నారు. 3 కోట్ల పది లక్షల మందికి సన్నబియ్యాన్ని తెలంగాణ లో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనున్నారని తెలిపారు, 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇల్లు ఇవ్వనున్నామని చెప్పారు. ఉచిత బస్సు, రైతు బీమా, రైతు భరోసా, ఎల్పిజి కనెక్షన్ లను తమ ప్రభుత్వం ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 4000 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. బడ్జెట్రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం అనే మరో అద్భుత పథకం తీసుకువచ్చిందని , ఈ పథకం కింద స్వయం ఉపాధి పొందేందుకు ఏప్రిల్ 14 వరకు ప్రభుత్వం గడువు పొడిగించిందని ఒక్కొక్కరికి నాలుగు లక్షల రూపాయల వరకు స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం ఉందని, అందువలన నిరుద్యోగ యువతా దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రప్రభుత్వం సన్నధాన్యాన్ని ప్రోత్సహించడంలో భాగంగా గ్రేడ్ ఏ ధాన్యాన్ని 2320 రూపాయలు క్వింటాలకు చెల్లించి కొంటున్నదని, అలాగే 500 రూపాయల బోనస్ ఇస్తున్నదని తెలిపారు.సన్న బియ్యం ఉత్పాదన తక్కువగా ఉన్నప్పటికీ రైతులు సన్న ధాన్యం ఎక్కువగా పండించినప్పుడే సన్న బియ్యం పంపిణీకి అవకాశం ఉంటుందని తెలిపారు.సన్న బియ్యం వల్ల వివిధ రకాల లాభాలు ఉన్నాయని, బ్లడ్ షుగర్ లెవెల్స్ నార్మల్ స్థాయికి తీసుకురావచ్చని, అలాగే సులభంగా జీర్ణం అయ్యేందుకు సన్న బియ్యం ఉపయోగపడతాయని మీడియాతో మాట్లాడినారు .

## పేదలు సైతం పెద్దల మాదిరిగానే సన్న బియ్యం తినాలి.

- చరిత్రలో నిలిచిపోయే సంక్షేమ పథకం.
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకులు తుమ్మల శ్రీనివాస్.



**తెలంగాణ పత్రిక వలిగొండ మండలం ఏప్రిల్ 2:** నర్సాయిగూడెం గ్రామములో తుమ్మల శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ.

సన్న బియ్యం పథకం నిరుపేదల ఆత్మగౌరవ పథకమని,చరిత్రలో నిలిచిపోయే పథకామని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిహయంలో పేదలు సైతం పెద్దల మాదిరిగానే సన్న బియ్యం తినాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులకు 20 లక్షల మందిని రేషన్ కార్డులలో పేర్లు చేర్పించడం జరిగిందన్నారు. 3 కోట్ల పది లక్షల మందికి సన్నబియ్యాన్ని తెలంగాణ లో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనున్నారని తెలిపారు, 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇల్లు ఇవ్వనున్నామని చెప్పారు. ఉచిత బస్సు, రైతు బీమా, రైతు భరోసా, ఎల్పిజి కనెక్షన్ లను తమ ప్రభుత్వం ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 4000 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. బడ్జెట్రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం అనే మరో అద్భుత పథకం తీసుకువచ్చిందని , ఈ పథకం కింద స్వయం ఉపాధి పొందేందుకు ఏప్రిల్ 14 వరకు ప్రభుత్వం గడువు పొడిగించిందని ఒక్కొక్కరికి నాలుగు లక్షల రూపాయల వరకు స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం ఉందని, అందువలన నిరుద్యోగ యువతా దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రప్రభుత్వం సన్నధాన్యాన్ని ప్రోత్సహించడంలో భాగంగా గ్రేడ్ ఏ ధాన్యాన్ని 2320 రూపాయలు క్వింటాలకు చెల్లించి కొంటున్నదని, అలాగే 500 రూపాయల బోనస్ ఇస్తున్నదని తెలిపారు.సన్న బియ్యం ఉత్పాదన తక్కువగా ఉన్నప్పటికీ రైతులు సన్న ధాన్యం ఎక్కువగా పండించినప్పుడే సన్న బియ్యం పంపిణీకి అవకాశం ఉంటుందని తెలిపారు.సన్న బియ్యం వల్ల వివిధ రకాల లాభాలు ఉన్నాయని, బ్లడ్ షుగర్ లెవెల్స్ నార్మల్ స్థాయికి తీసుకురావచ్చని, అలాగే సులభంగా జీర్ణం అయ్యేందుకు సన్న బియ్యం ఉపయోగపడతాయని మీడియాతో మాట్లాడినారు .

## గ్రామపంచాయతీ ఉద్యోగుల ధర్నా




**సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్:** ప్రతి నెల ట్రెజరీ ద్వారా ఒకటవ తారీఖున గ్రామపంచాయతీ ఉద్యోగుల జీతాలు ఇవ్వాలని ఈరోజు ఎంపీడీవో ఆఫీసుల ముందు ధర్నా చేయటం జరిగినది జిల్లా ఉపాధ్యక్షులు నోముల స్వామి ,కూరల కృష్ణయ్య ,కె లక్ష్మయ్య ,ఎం యాదయ్య ,ఎస్ రమేష్, ఎం భారతమ్మ, వి లక్ష్మి ఎం మారెమ్మ ,ఏ కవిత తదితరులు పాల్గొన్నారు

# యువ తేజం మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

- నిరుద్యోగ యువతీ యువకులకు అద్భుత అవకాశం సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ (ఐపీఎస్)



**సీకే న్యూస్ నల్లగొండ ఏప్రిల్ 2:** నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్.నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యువ తేజం కార్యక్రమంలో భాగంగా ఈనెల 5వ తారీకు శనివారం ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ కంపెనీల ద్వారా నిరుద్యోగ యువతీ యువకుల మెగా జాబ్ మేళా నిర్వహించబడుతుందని జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతలు:పదవ తరగతి/ ఇంటర్/డిప్లమా/ఫార్మసీ/డిగ్రీ/ ఇంజనీరింగ్/పీజీ స్థాయి విద్యార్థులు వయస్సు18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాలు లోపు వారు మీ యొక్క వివరాలను పోలీస్ స్టేషన్లో వెంటనే నమోదు పరుచుకోవాలి.ఇట్టి జాబ్ మేళా లో వందకు పైగా కంపెనీలు, 2500 వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయి. జాబ్ లో సెలెక్ట్ అయిన వారందరికీ వారి అర్హతలను బట్టి కనీస జీతం 13000/- రూపాయలు ఇవ్వబడును.కావున ఈ యొక్క అద్భుత అవకాశం నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రజలపక్షాన చేసిన పోరాటాలవల్లే వందేళ్లు మనగలిగాం.

- కార్మికులు, శ్రామికులు ఉన్నంతకాలం ఎర్ర జెండా ఉంటుంది.
- సిపిఐ శత వసంతోత్సవాలు పార్టీ విస్తరణకు దోహదపడాలి.
- పాల్వంచ ప్రాంత సమగ్రాభివృద్ధిపై ఎమ్మెల్యే కూనంనేని ప్రత్యేక శ్రద్ధ.
- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం.
- సిపిఐ వెంగళరావుకాలనీ సీపీఐ శాఖ మహాసభ విజయవంతం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 02,** పాల్వంచ: ప్రజలపక్షాన చేసిన పోరాటాలవల్లే వందేళ్లు సీపీఐ మనగాలుతుందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. మంగళవారం రాత్రి పట్టణ పరిధిలోని వెంగళరావుకాలనీ సీపీఐ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముత్యాల మాట్లాడుతూ కార్మికులు, శ్రామికులు ఉన్నంతకాలం ఎర్ర జెండా సజీవంగా ఉంటుందని తలిపారు. నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిస్కారంకోసం, పార్టీ పటిష్ఠతకోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. వందేళ్లగా పేద ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ శతవసంతాలు వేడుకలు సందర్భంగా ఈ ఉత్సవాలను ప్రతి వార్డులో ఘనంగా నిర్వహించాలని, తద్వారా పట్టణంలో మరింత పార్టీ విస్తరణకు శతవసంతాల ఉత్సవాలు దోహదపడాలని పిలుపునిచ్చారు. స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు నియోజకవర్గని అన్ని విధాల అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నారని తెలిపారు. లిఅనంతరం వెంగళరావుకాలనీ సిపిఐ నూతన శాఖ కార్యదర్శిగా కుర్రు రమేష్ సహాయ కార్యదర్శులుగా బాలాజీ, తులసీరామ్ తో పాటు 18 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో లిసీపీఐ జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, వైఎస్ గిరి, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, బస్తీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి తిరుకల్యాణం కి బియ్యం వితరణ.

**జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఏఇడి ఇండియాఫౌండేషన్ సహకారం తో అందజేత.**




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 02,**

ఏప్రిల్6 వ తేదీన దక్షిణ అయోధ్య భద్రాచలం లో శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామి తిరు కళ్యాణమునకు విచ్చేసిన భక్తులకు అన్నదాన నిమిత్తం జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమెరికాలోని ఏ ఐ డి ఇండియా ఫౌండేషన్ 20 బస్తాలు బియ్యం(5 కింటాళ్ల ) ని భద్రాచలం దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి రమాదేవి కి జేడీ ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయఈఓ మాట్లాడుతూ జేడీ ఫౌండేషన్ కి, అమెరికా లో ఉన్న కూడా భద్రాచలం దేవస్థానం కి బియ్యం అందించిన ఏఐడి ఇండియా ఫౌండేషన్ కి కృతజ్ఞతలు తెలిపారు. జేడీ ఫౌండేషన్ వారు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ, భద్రాచలం పేరు ని నలు దిక్కు లా చాటుతున్నారని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ సభ్యులు హన్సి, సునీత, కడాలి నాగరాజు, యూసుఫ్ మియా, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యం, ప్రజా పాలన అంటే విద్యార్థుల హక్కులను కాలరాయడమేనా.

**రేపు జరగబోయే చలో సెక్రటేరియట్ ముట్టడినీ జయప్రదం చేయండి**

**ఎస్ ఎఫ్ ఐ.**

**ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి - ఎస్ ఎఫ్ ఐ.**

**- 400 ఎకరాల భూమిని యూనివర్శిటీ పేరుతో రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలి.**

**ఎస్ఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ.**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 02,** : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన 400 ఏకరాల భూములను వేలం వేయాలని తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా యూనివర్సిటీ విద్యార్థులు పోరాడుతుంటే వారిని అక్రమంగా వీధి రౌడీలాగ లాక్కొని వెళ్ళి అరెస్ట్ చేయడం తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న సిగ్గుమాలిన చర్య అని ఎస్ఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులు, కొప్పుల రవీందర్ అన్నారు.రేపు జరగబోయే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చలో సెక్రటేరియట్ ముట్టడి జయప్రదం చేయాలని విద్యార్థి లోకానికి వారు పిలుపునిచ్చారు. అనంతరం ఎస్ఎఫ్ఐ సీనియర్ నాయకులు భూపేందర్ మాట్లాడుతూ.... యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా భూములనే కొల్లగొట్టేందుకు సిద్ధమైతే భవిష్యత్తులో యూనివర్సిటీ ఉనికి ప్రమాదంగా మారుతుందని ప్రభుత్వాల నుండి ఎదురయ్యే ప్రమాదకరమైన పరిస్థితులను ముందుగానే గమనించిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు భవిష్యత్తులో ప్రయోగశారులకు అవసరమైన భూములు చేజారి పోతే భవిష్యత్తు తరాల విద్యార్థులకు యూనివర్సిటీ ఉనికి ప్రమాదం అని న్యాయబద్ధంగా 400 ఎకరాల భూముల రక్షణ కోసం శాంతియుతంగా నిరసన కొనసాగిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల గొంతు నొక్కి ఆ ప్రజాస్వామికంగా, విద్యార్థులపై లాఠీ చార్జ్ చేయడం అక్రమ అరెస్టులకు పాల్పడుతుందని వేల కోట్ల విలువైన హెచ్. సి. యు భూములను కార్పోరేట్ శక్తులకు దారదత్తం చేసేందుకై రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ కుట్ర పన్నుతోందని అన్నారు. అక్కడ అడవులను చదును చేయాలనే పేరుతో బుల్డోజర్, జెసిబిలను దింపి చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టిందన్నారు. ఎన్నో వృక్ష , జంతు జాతులకు నిలయంగా ఉన్న ఆ భూములను వేలం వేయడం సరికాదన్నారు. జెసిబిలను అడ్డుకున్న విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్టు చేశారన్నారు. విద్యార్థులపై నిర్బంధాన్ని ప్రయోగించటం, పోలీసు బలగాలతో యూనివర్సిటీని నిర్బంధించటం వంటి సంఘటనలకు నిరసనగా శాంతియుతంగా ప్రజాస్వామిక బద్ధంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తూ ఆడవాళ్లను కూడా చూడకుండా జుట్టు పట్టుకొని మరి ఈడ్చుకుంటూ వాహనాల్లో నిర్బంధించారని ఇందిరమ్మ రాజ్యం, ప్రజా పాలన అని గొప్పలు చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం అప్ ప్రజాస్వామికంగా విద్యార్థులపై అక్రమ అరెస్టులు పెట్టడం ఏంటి అని వారు ప్రశ్నించారు. మా పాలనలో నిర్బంధాలు ఉండవని అధికారంలో వచ్చిన వెంటనే ప్రగతి భవన్ కంచెలు తొలగించి ఇప్పుడు ఏకంగా ఇండ్లలోకి వెళ్ళి మరీ అరెస్టు చేయటాన్ని వారి ప్రభుత్వం యొక్క నియంత పాలనకు నిదర్శనంగా చెప్పవచ్చు అని అన్నారు. హెచ్. సి.యు భూములను యూనివర్సిటీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయాలని లేకపోతే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఇటువంటి చర్యలతో విద్యార్థులు చేస్తున్న ఉద్యమాలను ఆపలేరని ఖండించారు.




## భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలోఆత్మకూర్ ఎమ్మర్వోగారికి మెమొరాండం ఇవ్వడం జరిగింది



**సీ కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్ :** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆత్మకూరు ఎమ్మార్వో గారికి మెమోరండం ఇవ్వడం జరిగింది రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా ప్రజలకు సన్న బియ్యం ఇవ్వడం జరుగుతుంది అందులో ఒక్కరికి కేంద్ర ప్రభుత్వం 5 కిలోలు రాష్ట్ర ప్రభుత్వం ఒక కిలో బియ్యాన్ని ఇవ్వడం జరుగుతుంది ప్రతి రేషన్ షాప్ లో ఓపెనింగ్ రోజు. ఫ్లెక్సీలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి ఫోటో వేయాలని మండల శాఖ నుంచి డిమాండ్ చేస్తున్నా ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మండల పార్టీ అధ్యక్షులు గజరాజు కాశీనాథ్ భూత అధ్యక్షులు లోడి వెంకటయ్య యాస వెంకట్ రెడ్డి బీజేవైఎం నాయకులు మజ్జిగ నరేష్ బొజ్జే పవన్ బిజెపి నాయకులు గ్రామ శాఖ ఉపాధ్యక్షులు శబ్బ పీస్ నరసింహారావు గడ్డం స్వామి తదితరులు పాల్గొన్నారు

## ఆక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు.

- సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్.
- బంజారాలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి లేనిపక్షంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తాం.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 02,** లంబాడి సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడి కార్యక్రమానికి సేవాలాల్ సేన మరియు గిరిజన సంఘాలు కలిసి పిలుపునిచ్చాయి ఈ నేపథ్యంలో సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్ ను లక్ష్మీదేవి పల్లి పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు అక్రమ అరెస్టులతో గిరిజన ఉద్యమాల ను ఆపలేరని అన్నారు బంజారా జాతికి మంత్రి పదవి ఇవ్వకపోతే ఎమ్మెల్యేలు ఎంపీలు మంత్రుల ఇళ్లను సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ అధ్యక్షతన ముట్టడిస్తామని హెచ్చరించారు బంజారాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ పార్టీ వ్యవహరించకూడదు అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడం కోసం బంజారా లు ఎంతో కష్టపడ్డారని రాష్ట్రవ్యాప్తంగా వారి ఓట్లను అందరూ ఏకధాటిపై ఒకే వైపు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం వల్ల కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిందనే విషయాన్ని మర్చిపోవద్దని గుర్తు చేశారు తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులలో కులాలవారీగా చూస్తే ఎక్కువగా లంబాడాలు ఉంటారని అన్నారు లంబాడా సామాజిక వర్గం దాదాపుగా 40 లక్షల నుండి 50 లక్షల వరకు ఉంటారని అన్నారు ఇంత ఎక్కువ జనాభా కలిగిన లంబాడ సామాజిక వర్గానికి ఈనాటికి మంత్రి పదవి ఇవ్వకపోవడం చాలా బాధాకరమైనటువంటి విషయమని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రాష్ట్రంలో ఉన్న లంబాడాలకు మంత్రి పదవి లో చోటు కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు లేని పక్షంలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

# HCU భూముల ఆక్రమణ, రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం, విద్యార్థి నాయకుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ సిపిఎం రాస్తారోకో....



సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఏప్రిల్ 2.
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (%ఎజఖ%) భూములను రాష్ట్ర ప్రభుత్వ ఆక్రమణ విషయంలో విద్యార్థి సంఘ నాయకులను మరియు సిపిఎం పార్టీ ప్రజాసంఘాల నాయకత్వాన్ని రాష్ట్రవ్యాప్తంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం రోజున వలిగొండ మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు

ఈ సందర్బంగా సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ చెందిన 400 ఎకరాల భూముల విషయంలో అక్రమ వేలం వేసే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని అదేవిధంగా యూనివర్సిటీకి చెందిన 1500 ఎకరాల భూమిని వెంటనే యూనివర్సిటీ కి రిజిస్ట్రేషన్ చేయాలని యూనివర్సిటీ భూముల రక్షణకై పోరాడుతున్న విద్యార్థి సంఘ నాయకులపై రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం నాయకుల పై పెట్టిన అక్రమ కేసుల్ని ఎత్తువేయాలని డిమాండ్ చేశారు ఈ యూనివర్సిటీ భూముల విషయంలో కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి బండి సంజయ్ లు ప్రకటనలు చేయకుండా ఆ 400 ఎకరాల భూమిని కాపాడేందుకు పార్లమెంట్లో చర్చ జరపాలని రాష్ట్ర ప్రభుత్వం పై కేంద్రం ఒత్తిడి తెచ్చే విధంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు,బిజెపి రాజకీయ లబ్ధి కోసం వ్యవహరించకుండా బాధ్యతాయుతంగా యూనివర్సిటీ భూములను యూనివర్సిటీకి చెందే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు రాష్ట్ర ప్రభుత్వం భూముల వేలం విషయంలో నియంతృత్వంతో వ్యవహరించకుండా పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు, హైదరాబాద్ సరిహద్దు ప్రాంతంగా ఉన్న రంగారెడ్డి జిల్లా చుట్టూ అన్యాక్రాంతమైన 18000 ఎకరాల భూములపై కమిషన్ వేసి వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని దాని ద్వారా ప్రభుత్వానికి ఆదాయాన్ని రాబట్టేందుకు ప్రయత్నించాలని, విద్యార్థులకు పరిశోధనలకు ఉపయోగపడే యూనివర్సిటీ భూములను వేలం వేసే, పర్యావరణాన్ని విధ్వంసం చేసే చర్యలకు స్వస్తి చెప్పాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గణపతి రెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కందడి సత్తిరెడ్డి, మండల కమిటీ సభ్యులు కల్కూరి రామచందర్,దుబ్బ లింగం, పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ,నాయకులు చేగురి నరసింహ,రాధారపు మల్లేశం, కొండూరు సత్తయ్య, ద్యానబోయిన యాదగిరి, వేముల నాగరాజు, మాదుగుల వెంకటేశం, మైసొళ్ల నరేందర్,వనం బాను చందర్,నరసింహ,తదితరులు పాల్గొన్నారు,

# బీఆరెస్ నాయకులు ఆకుల ముత్యం గౌడ్ కన్నుమూత.....




సీ కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్ :ఆకుల ముత్యం గౌడ్ మరణం బీఆరెస్ పార్టీ కి తీరని లోటు– ఆలేరు మాజీ శాసన సభ్యురాలు శ్రీమతి గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి గారు

యాదాద్రి భువనగిరి జిల్లా:– ఆత్మకూరు (యం) మండలం ఉప్పలపహడ్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ ఆకుల సరిత భర్త ఆకుల ముత్యం గౌడ్ అనారోగ్య కారణంగా మరణించారు వారి కుటుంబాన్ని ఆలేరు మాజీ శాసన సభ్యురాలు శ్రీమతి శ్రీ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి గారు పరామర్శించి ఓదార్చారు ముత్యం గౌడ్ సేవలు బీఆరెస్ పార్టీ మరువదు అన్నారు అదేవిధంగా బీఆరెస్ పార్టీ దాతల నుంచి 167,000? రూపాయల ఆర్థిక సహాయాన్ని మాజీ ఎమ్మెల్యే గారు అందజేశారు

దాతలు అందించిన వారు:–గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి మాజీ %మీూ 10,000
%కొప్పుల హరీదీప్ రెడ్డి (%ఖఎ=%ఫౌండేషన్ ఆత్మకూరు)20,000
బీసు చందర్ గౌడ్ మండల పార్టీ అధ్యక్షులు 10,000
బాషబోయిన ఉప్పలయ్య యాదవ్ కురెళ్ళ తాజా మాజీ సర్పంచ్ 10,000
ఏనుగు దయాకర్ రెడ్డి మాజీ %ఎ×ూ వీూ% ఆత్మకూరు 10,000
పెసరు గిరిజా గోపాల్ రెడ్డి పుల్లాయి గూడెం తాజా మాజీ సర్పంచ్ 10,000
గనగాని మాధవి మల్లేశం గౌడ్ పోతిరెడ్డిపల్లి తాజా మాజీ సర్పంచ్ 10,000
సామ వరలక్ష్మి శ్రీనివాసరెడ్డి10,000 కప్రాయపల్లి తాజా మాజీ సర్పంచ్
లగ్గాని రమేష్ గౌడ్ పారుపల్లి తాజా మాజీ సర్పంచ్ 5000
యాస కవితా ఇంద్రారెడ్డి తాజా మాజీ ఎంపిటిసి ఆత్మకూరు 5000
పంజాల వెంకటేష్ గౌడ్ మాజీ సర్పంచ్ రాయిపల్లి 5000
సామ తిరుమల్ రెడ్డి తాజా మాజీ సర్పంచ్ మొరిపిరాల 5000
కోల సత్తయ్య గౌడ్ తాజా మాజీ సర్పంచ్ కోరటికల్ 5000
బబ్బూరి రమేష్ గౌడ్ తాజా మాజీ సర్పంచ్ మెదుగుబావి గూడెం 5000
కల్వల అంజయ్య సారాగండ్ల తాజా మాజీ సర్పంచ్ 5000
యాస అంజిరెడ్డి %ట% రేపాక గ్రామ శాఖ అధ్యక్షులు 5000
దొండ కమలమ్మ పురుషోత్తం రెడ్డి రాఘవపురం తాజా మాజీ సర్పంచ్ 5000
నాయిని నర్సింహారెడ్డి తాజా మాజీ సర్పంచ్ పల్లెర్ల 5000
ఏనుగు రాంరెడ్డి 5000
మామిడి లలితా మహన్ రెడ్డి మొదుగుంట తాజా మాజీ సర్పంచ్ 5000
పంజాల సుమతి శ్రీనివాస్ గౌడ్ తాజా మాజీ సర్పంచ్ రాయిపల్లి 5000
గడ్డమీది రమేష్ గౌడ్ మాజీ సర్పంచ్ %ట% రేపాక 5000
పొనగాని జహంగీర్ 3000 %ూ స్థుతీసవఅ ఫ్ఝుఎబతీ (ఎ)
%కాలే మల్లేష్ గ్రామ శాఖ అధ్యక్షులు పల్లెపహడ్ 2000
మల్లెల పర్వతాలు 2000 రహీంఖాన్ పేట మాజీ సర్పంచ్
ఈ కార్యక్రమంలో మండల నాయకులు వివిధ గ్రామాల నుండి వచ్చిన కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గోపిశెట్టి సుస్మితాను సన్మానించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి..

తల్లాడ ఏప్రిల్ 2 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్
కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వర్లు, విజయమ్మ దంపతుల కుమార్తె గోపిశెట్టి సుస్మిత గ్రూప్1 ఉద్యోగం సాధించింది. ఈ సందర్భంగా బుధవారం సుస్మితాను సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శాలువాలు పూలమాలలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడి చదివి ఉద్యోగం సాధించడం అభినందనీయమని, ఉద్యోగం ద్వారా పేద ప్రజలకు సేవలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గోపిశెట్టి వెంకటేశ్వర్లు, విజయమ్మ దంపతులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దుండేటి వీరారెడ్డి, దీవెల కృష్ణయ్య, రాయల రాము, మూకర ప్రసాద్, అడపా అనిల్ చౌదరి, మాజీ



ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ యాకుబ్ పాషా, గోపి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డున్న ప్రతిఒక్కరికి సన్నబియ్యం అందజేత



**- పేదోళ్ళు సన్నబియ్యం తినాలనే లక్ష్యం కాంగ్రెస్ పార్టీది**
**- నియోజక వర్గంలో నేటికి వెయ్యికోట్ల రూపాయలతో అభివృద్ధి**
**- ఖమ్మం జిల్లా యువజన నాయకులు అడపా అనిల్**

తల్లాడ ఏప్రిల్ 2 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్..
రేషన్ కార్డున్న ప్రతి ఒక్కరికి సన్నబియ్యం అందజేయడమే రాష్ట్ర ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని ఖమ్మం జిల్లా యువజన నాయకులు అడపా అనిల్ అన్నారు. బుధవారం తల్లాడ మండలం నూతనకల్ గ్రామంలోని రేషన్ దుకాణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఉగాది కానుకగా సన్నబియ్యం పథకాన్ని సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు అడపా అనిల్ ప్రారంభించారు . ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిలుగా. కళ్యాణపు వెంకటయ్య. కిన్నెర శ్రీను.వంగూరి భూషణం. వీరబాబు. వంశీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ పేదోళ్ళు సన్నబియ్యం తినాలనే ముఖ్య లక్ష్యం కాంగ్రెస్ ప్రభుత్వంది అని ఆయ గుర్తుచేశారు. అంతే కాకుండా పేదలకు రేషన్ కార్డులపై దొడ్డు బియ్యం బదులు సన్న బియ్యం ఇస్తామని అన్ని ప్రధాన పార్టీలు ఎన్నో ఏళ్లుగా చెబుతూనే వచ్చాయని ఆయన అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు భాగంగా సన్న బియ్యం పేద ప్రజలకు అందే విధంగా కృషి చేసినటువంటి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి కి. బట్టి విక్రమార్క గారికి. ఉత్తంకుమార్ రెడ్డి కి. తుమ్మల నాగేశ్వరావు కి. శ్రీనివాస్ రెడ్డి కి. మట్టా రాగమయి దయానంద్ కి వారి గ్రామం తరపు నుండి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు...

## గ్రూప్ 1 కొలువు సాధించిన రాహుల్ సన్మానించిన పీఆర్టియూ జిల్లా బాధ్యులు..

తల్లాడ ఏప్రిల్ 2 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్:గ్రూప్ 1 ఉద్యోగం సాధించిన తల్లాడకు చెందిన చింతా రాహుల్ ను పిఆర్టియు ఉపాధ్యాయ సంఘం జిల్లా బాధ్యులు బుధవారం తల్లాడలో సన్మానించారు. ఈ పిఆర్టియు జిల్లా అధ్యక్షులు వై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిఆర్టియు కుటుంబ సభ్యులకు ఉద్యోగం రావడం అభినందనీయం అన్నారు. ఉద్యోగ నిర్వహణలో ప్రతిష్ట పెంచే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు విజయ అమృత కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు రత్నకుమార్, రాష్ట్ర సొసైటీ అధ్యక్షులు పి వెంకటేశ్వర రెడ్డి, ఏన్కూరు మండలం పి ఆర్ టి యు మండల ప్రధాన కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, కామేపల్లి మండల ప్రధాన



కార్యదర్శి వెంకన్న, ప్రముఖ పారిశ్రామికవేత్త గోపాలరావు, సీతారాములు, కుసుమ, నాగేశ్వర రావు, చింతకాని మండలం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ విజేత కేటీ కింగ్స్



సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి, (వెంకటేష్)ఏప్రిల్ 02,టేకులపల్లి మండలం మొక్కంపాడుతండా యువకులు నిర్వహించిన క్రికెట్ పోటీలో కేటీ కింగ్స్ జట్టు విజేతగా నిలిచింది. కొత్తతండ, మొక్కంపాడు టీంలు ఫైనల్ లో తలపడగా, కొత్త తండ టీం విజయం సాధించింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... యువత క్రీడలతో పాటు చదువులో కూడా రాణించాలని అన్నారు. గ్రామలలో క్రీడల పోటీలు నిర్వహించడం వల్ల యువతలో ఐక్యతతో పాటు నైపుణ్యతను కలిగిస్తాయని అన్నారు. దాదాపు 40 టీంలు పోటీల్లో పాల్గొనగా ప్రథమ, ద్వితియ, తృతీయ, బహుమతులు ఇచ్చారు.
ప్రథమ బహుమతి కేటీ కింగ్స్ రూ.10,516, ద్వితీయ బహుమతి రూ.10,016/ మొక్కంపాడు జట్టుకు, తృతీయ బహుమతి 5,016 ఇచ్చారు. గెలుపుపొందిన టీమ్స్ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్ బానోత్ రవి, మొక్కంపాడు మాజీ ఉపసర్పంచ్ మాలోత్ రాందాస్, బోడు గ్రామపెద్దలు పోతుగంటి వీరభద్రం, యువజన నాయకులు చంద్రశేఖర్, అన్వేష్, సురేష్, రాజబాబు, నిర్వహకులు రామకృష్ణదొర, బీజ్జా రవీందర్, సుభాస్, నరేష్, ప్రకాష్, రెబల్, మొక్కంపాడు యూత్ పాల్గొన్నారు.

## మహనీయుల జయంతి వేడుకలలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలి...

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**
**ఏప్రిల్ 5న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు**
**ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహణ**
**భక్త రామదాసు కళాక్షేత్రం వేదికగా మహనీయుల జయంతి వేడుకలు నిర్వహణ**

సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఏప్రిల్ – 02:
డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయుల జయంతి వేడుకలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో ఉదయం 9.00 నుంచి 9–30 గంటల వరకు ఏప్రిల్ 5న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, ఏప్రిల్ 14 న డాక్టర్ బిఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరుగుతుందని,



అనంతరం ఉదయం 10–30 గంటలకు స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో ఏప్రిల్ 5న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, ఏప్రిల్ 14 న బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.
మహనీయుల జయంతి వేడుకలలో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, అన్ని సంఘాల నాయకులు, అన్ని వర్గాల ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## (ఊర చెరువు) కట్ట మైసమ్మగుడి మరియు బొడ్రాయి శంకుస్థాపన).



సి కె న్యూస్ వలిగొండ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఏప్రిల్ 2. ఊరు గ్రామ పెద్దల సమక్షంలో.
అరూరు గ్రామం వలిగొండ మండలం యాదాద్రి భువనగిరి జిల్లా తేదీ'2-4-2025 రోజున ఊర చెరువు కట్ట మైసమ్మ మరియు బొడ్రాయి శంకుస్థాపన చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిట్టి డి జనార్దన్ రెడ్డి గారు కట్టమైసమ్మ బొడ్రాయి డెవలప్మెంట్ కమిటీ చైర్మన్, %జ,చీ%, రెడ్డి గారు అఖిలపక్ష కమిటీ సభ్యులు బండారు నరసింహ రెడ్డి గారు జినుకల దానయ్య పోలేపాక చెమ్మయ్యపోలేపాక యాదయ్య చిలకమర్రి కనకాచారి బండి రవికుమార్ ఆవుల బిక్షం కళ్లెం బాల శంకర్ తుమ్మల సంతోష్ కుమార్ ఆవుల స్వామి నిమ్మల రవికుమార్ ఓరుగంటి రామచంద్రం చిటెడీ దామోద రెడ్డి గురునాథ్ పల్లి మల్లేశం చిలకమర్రి బ్రహ్మాచారిబాసాని శ్రీను జినుకల ఉదేశ్ కొడితల లక్ష్మయ్య సుంకి ఆనంద్ మర్రి నాగరాజు మారగోని శీను వేముల నరసింహ ఉడుత రామకోటి సుక్క రామచంద్రం వేముల నరసింహ ఎర్ర శ్రీను ఎర్ర వెంకయ్య లోతుకుంట బాలరాజు ఎర్ర మచ్చగిరి పోలేపాక కుమారస్వామి వెలిమేనేటి సంతోష్ కళ్ళెం వీరస్వామి జాడ నవిన్ సింగన బోయిన కృష్ణ గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ఐ ఎన్ టి ఎస్ ఓ టాలెంట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన శ్రీ చైతన్య విద్యార్థులు.




సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఏప్రిల్ 2. యాదాద్రి భువనగిరి జిల్లా వడిగొండ మండల కేంద్రంలో ఉన్న శ్రీ చైతన్య స్కూలు విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ లో నిర్వహించిన, ఫైనల్ లెవెల్ పరీక్షల్లో విద్యార్థులు ఒకటి,మూడు, నాలుగు,ఐదువ ర్యాంకులతో పాటు గోల్డ్ మెడల్స్ ను మరియు సర్టిఫికెట్స్ వివిధ భాగాలలో మొత్తం 20 మంది విద్యార్థులు కైవసం చేసుకున్నారని, దీనికి అనుకూలంగా శ్రీ చైతన్య పాఠశాల గౌరవనీయులు ప్రిన్సిపల్ బాలరాజు డి ఎన్ శివ మరియు విద్యా బోధకులు విద్యార్థుల భవిష్యత్తు మేరకు ఇంకా మరిన్ని మేలైన ప్రతి ప్రతిపాదికలతో మెరుగైన విద్యా బోధనను అందిస్తూ కృషి చేస్తామని మీడియా ద్వారా చెప్పినారు.

## ఉద్యోగం సాధించిన సందర్భంగా మొక్కను నాటించిన మాజీ సర్పంచ్ శీలం కోటారెడ్డి..



తల్లాడ ఏప్రిల్ 2 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్:
తల్లాడకు చెందిన గోపిశెట్టి సుస్మితకు గ్రూపు 1 ఉద్యోగం రావడం పట్ల తల్లాడ మండలంలోని రామానుజవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్ శీలం కోటారెడ్డి మొక్కను నాటించారు. బుధవారం తల్లాడలో ఆమె స్వగృహంలో శాలువాలతో సన్మానించి, ఆమె చేతుల మీదగా మొక్కలు నాటారు. అనంతరం ఆమెకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ పరంజ్యోతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొమ్మినేని వెంకటేశ్వరావు కె.వి, ఎర్రి నరసింహారావు, పాస్టర్ అజయ్ బాబు తదితరులు ఉన్నారు.

# మహిళలు ఆర్థిక స్వావలంబన కలిగి ఉంటే వ్యాపారాభివృద్ధి సాధిస్తారు...



- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- వేసవి కాలానుగుణంగా పరిస్థితులను బట్టి వ్యాపారాలను విస్తరించుకోవాలి..
- అందించిన తోడ్పాటు అవకాశాలను ఉపయోగించుకొని పదిమందికి ఉపాధి ఇవ్వాలి
- అప్పటి నుండి ఇప్పటి వరకు నాణ్యత, టీ రుచిలో ఏలాంటి లోటులేదు చెల్లెమ్మ అంటూ కితాబుచ్చిన జిల్లా కలెక్టర్

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఏప్రిల్-02:**ప్రజలలో నమ్మకం కలిగిస్తూ నాణ్యతను పెంచుతూ వ్యాపారాలను విస్తరించుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకాంక్షించారు.

ఖమ్మం జిల్లా సమీకృత కార్యాలయం బస్ స్టాప్ సెంటర్ లోని ఇందిరా మహిళా శక్తి స్త్రీ టీ స్టాల్ ను బుధవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శించారు. స్త్రీ టీ స్టాల్ నిర్వహకురాలని కలెక్టర్ పలకరించారు. రోజు కలెక్టరేట్ కు వస్తూ, పోతూ చూస్తున్నాను జనం ఉంటూన్నారు. వ్యాపారం మంచిగా నడుస్తుందా, వేసవి కాలం దృష్ట్యా వ్యాపార అభివృద్ధిలో భాగంగా బటర్ మిల్క్, లెమన్ వాటర్, మిల్క్ షేక్, ఫాలుదా, పండ్ల రసాలు వంటివి విక్రయించేందుకు గల అవకాశాలు పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. పాల ఉత్పత్తులతో నాణ్యమైన లస్సీ తయారు చేసి అమ్మితే అధిక లాభాలు వస్తాయని, ఆ దిశగా ఆలోచనలు చేయాలని కలెక్టర్ సలహా ఇచ్చారు. నూతనంగా వివిధ రకాల చల్లని ఐస్ క్రీమ్ లు, కూల్ డ్రింక్స్ ఏర్పాటు చేశారు సంతోషం అని, ప్రజలకు నాణ్యమైన పదార్థాలు విక్రయిస్తూ మంచి లాభాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్లాస్టిక్ వస్తువులను నిర్మూలిస్తూ ప్రస్తుత ఉన్న కాలాన్ని అనుగుణంగా ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని నాణ్యతను కొనసాగిస్తూ, నమ్మకాన్ని పెంచుకోవాలని సూచించారు. ఉపాధి పొందడమే కాక ఆర్థిక బలంతో పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

టీ స్టాల్ నిర్వహకురాలి కోరిక మేరకు కలెక్టర్ టీ సేవించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు చాయ్ ని ఆదే నాణ్యతను, రుచి కొనసాగిస్తున్నందుకు ప్రశంసితూ అద్భుతమైన రుచితో టీ బాగుంది చెల్లెమ్మ అంటూ కలెక్టర్ కితాబు ఇవ్వారు. మహిళలు ఆర్థికంగా బలపడాలనే సంకల్పంతో ఇందిరా మహిళా శక్తిలో భాగంగా స్త్రీ టీ స్టాల్స్ ను మరిన్ని ఖమ్మంలో నెలకొల్పి మహిళలను ప్రోత్సహిస్తామని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తి యూనిట్లను నిరంతరం పర్యవేక్షణ చేస్తూ స్త్రీ టీ క్యాంటీన్ మంజూరు చేసి నిర్వాకులకు వ్యాపారంలో తోడుగా అధికారులు ఉంటున్నారని అన్నారు. యూనిట్ కేటాయించాక ఏ మేరకు లాభాలు ఉంటాయనే అంశంతో పాటు వాటి నిర్వహణ, లాభాలను అంచనా వేస్తున్నామని అన్నారు.

మహిళలు స్వయం ఉపాధి పొందాలనే ఉద్దేశ్యంతో స్త్రీ టీ క్యాంటీన్లు ఖమ్మం బ్యాండ్ ఉండే విధంగా ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం తరపున యూనిట్ గ్రౌండ్ చేసి, స్థల గుర్తింపు, ఏమేం అమ్మాలి, నాణ్యతపై క్షుణ్ణంగా చర్చించి , శిక్షణ ఇప్పించాకే వారికి అర్థిక సహాయం అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

# ఆటిజం ను ఆషామాషీగా తీసుకోవద్దు...

- సీనియర్ వైద్యుల సూచన..
- భారత్ లోనూ నానాటికీ పిల్లల్లో పెరుగుతున్న ఆటిజం...
- ఐఏపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు డా.కూరపాటి
- సకాలంలో గుర్తిస్తేనే ఆటిజం నుండి బాల్యాన్ని కాపాడుకోవచ్చు... సైకియాట్రిక్ వైద్యులు
- ఆటిజం అవగాహన సదస్సుకు ఖమ్మంలో విశేష స్పందన..



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఏప్రిల్ 02:**ఒకప్పుడు పాశ్చాత్య దేశాల పిల్లలకే పరిమితమైన ఆటిజం నేడు భారతదేశంలోనూ తన ఆనవాళ్లు చూపిస్తోందనీ, రాను రాను భారతదేశంలోని చిన్నారులు సైతం ఆటిజం బారిన పడుతున్నారని ఖమ్మం నగరానికి చెందిన సీనియర్ వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం (ఏప్రిల్02) సందర్భంగా ఖమ్మం ఐఎంఏ హాల్లో బుధవారం సాయంత్రం ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కంభంపాటి నారాయణరావు, డాక్టర్ కె జగదీష్ బాబు తో పాటు పలువురు సీనియర్ వైద్యులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలలో భారత్ తో సహా ఆటిజం అనే అరుదైన లక్షణం చిన్నారులను వెంటాడుతుందన్నారు. ముఖ్యంగా చిన్నారుల తల్లిదండ్రులు వారిని ఒంటరిగా వదిలివేయడం, పిల్లలతో పేరెంట్స్ సక్రమంగా స్నేహ సంబంధాలు కొనసాగించకపోవడం, నిత్యం పని ఒత్తిడితో పిల్లలను సరిగా పట్టించుకోకపోవడం, ఫలితంగా చిన్నారులు ఆటిజం ప్రారంభం అవుతుందన్నారు. ఎవరితోనూ కలవకపోవడం, సమాజానికి, వ్యక్తులకు, దూరంగా ఉండడం, చిరాకుగా ఉంటూ.. ఎవరిమాటా వినకపోవడం, వారికి నచ్చినట్టుగా ప్రవర్తించడం, తల్లిదండ్రుల మాట వినకపోవడం, సూటిగా చూస్తూ మాట్లాడలేకపోవడం, తదితర లక్షణాలు అన్ని ఆటిజం పరిధిలోకి వస్తాయి అన్నారు. తల్లిదండ్రులు జాగ్రత్త వహించి తమ చిన్నారుల పట్ల తగు సూచనలు పాటించకపోతే చిన్నారులు ఆటిజం బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరించారు.

**ఆటిజం అవగాహన సదస్సుకు విశేష స్పందన...**

బుధవారం సాయంత్రం ఖమ్మం ఐఎంఏ హాలులో ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఆటిజం అవగాహన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పలువురు సీనియర్ వైద్యులతో పాటు ఆర్టిజం పిల్లల తల్లిదండ్రులు నగరానికి చెందిన లయన్స్ క్లబ్ బాధ్యులు, ఖమ్మం నగర ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ... పిల్లలను ఆటిజం బారిన పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా తల్లిదండ్రుల పైనే ఉందన్నారు. తల్లిదండ్రులు జాగ్రత్త వహిస్తే బాల్యం ఆటిజం బారిన పడే అవకాశం లేదన్నారు. అందుకుగాను తల్లిదండ్రులలో ఆటిజం పట్ల స్పష్టమైన అవగాహన ఉండాలని డాక్టర్ ప్రదీప్ కుమార్ సూచించారు. తల్లిదండ్రులలో అవగాహన లేకపోతే, పిల్లలను ఒంటరిగా వదిలేస్తే, మరింత మంది ఆటిజం బారిన పడే ప్రమాదం ఉందని డాక్టర్ ప్రదీప్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఆటిజం బారిన పడిన చిన్నారులకు సంబంధించి వీడియోను ప్రదర్శించి పిల్లల తల్లిదండ్రులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ సభ్యులు, ఖమ్మం నగరానికి చెందిన డాక్టర్ స్వప్న, సీనియర్ వైద్యులు డాక్టర్ వై ప్రసాద్ డాక్టర్ వీరేందర్ చిట్టె, డాక్టర్ సతీష్ బాబు, డాక్టర్ శివకృష్ణ డాక్టర్ వంశీధర్, డాక్టర్ కుసుమరాజు రవికుమార్, డాక్టర్ ప్రణహిత్ రెడ్డి, డాక్టర్ బ్రహ్మ కుమార్, డాక్టర్ వంశీ మమత మెడికల్ పీజీ సైకియాట్రిక్ స్టూడెంట్స్, లయన్స్ క్లబ్ బాధ్యులు పూర్ణచంద్రరావు, విశ్వేశ్వరరావు, ఖమ్మం బటర్ ఫ్లై స్పెషల్ వింగ్స్ థెరపి సెంటర్ బాద్యులు ఆకుల లక్ష్మి, విజయ, అంకుర హాస్పిటల్స్ కు చెందిన పీడియాట్రిక్ వైద్య నిపుణులు డాక్టర్ రోహిత్ కిరణ్ , మమతా మెడికల్ కాలేజ్ పీజీ విద్యార్థులు డాక్టర్ ఆదిత్య, డాక్టర్ ప్రీతి, డాక్టర్ మౌనిక, డాక్టర్ వేణు, డాక్టర్ విజయ్ కాంత్, డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ నిహారిక, డాక్టర్ హారిక, డాక్టర్ ఆయిషి, డాక్టర్ శ్రీకర్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ అనురాగ్, డాక్టర్ సన, డాక్టర్ ప్రణతి, డాక్టర్ రియా, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఖమ్మం నగరానికి చెందిన సీనియర్ వైద్యులను డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి,( వెంకటేష్)ఏప్రిల్ 02**

టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామం నందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణి కార్యక్రమాన్ని ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఉద్దేశం సామాన్య ప్రజలకు ఆర్థిక భారం తగ్గించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా చేయడమే అన్నారు. ఈ పథకం ద్వారా అర్హత గల కుటుంబాలకు నాణ్యమైన సన్నబియ్యాన్ని ఉచితంగా పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ప్రతి పేద కుటుంబం ఆకలికి గురికాకుండా పోషకాహారాన్ని సమృద్ధిగా అందుకునేలా ఈ పథకం రూపొందించబడిందని తెలిపారు సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలు లేకుండా చూసుకోవాలని అధికారులను సూచించారు ఈ కార్యక్రమంలో తహీల్దార్. నాగ భవాని. డి టి సీఎస్ యాకూబ్ పాషా, ఎంపీడీఓ రవీంద్ర రావు, కోయగూడెం మాజీ సర్పంచ్ ఉమా – సురేందర్ , జీసీసీ మేనేజర్ నర్సింహారావు , ఎంపీవో గణేష్ గాంధీ, రేషన్ డీలర్స్ జిల్లా అధ్యక్షుడు వూకే శేఖర్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈది గణేష్, మంగీలాల్ , రేషన్ డీలర్స్ సంతులల్, హేమచందర్ , కళ్యాణ్ , సైదమ్మ , జి సి సి సేల్స్ మెన్స్ తవురియా, తదితరులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న అప్పలస్వామికి జనసేన నాయకులు కేఎన్ఆర్ ఆర్థిక సహాయం.



**సి కె న్యూస్ ప్రతినిధి:**పరవాడ మండలం, పెద్దముసిడివాడ పంచాయతీలో ఉన్న ఎస్సీ కాలనీలో గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న పావడ అప్పలస్వామికి పెద్దముసిడివాడ జనసేన నాయకులు కరణం నర్సింగరావు (కేఎన్ఆర్) వైద్య ఖర్చుల నిమిత్తం ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. అలాగే పెదముషిడి వాడ జనసేన సీనియర్ నాయకులు బలరెడ్డి అప్పారావు, కరణం నర్సింగరావు మాట్లాడుతూ మీ కుటుంబానికి ఎప్పుడు అండగా ఉంటామని ఇటువంటి కష్టం వచ్చినా మేము ఉన్నామని భరోసా కల్పించారు. చుట్టుప్రక్కల గ్రామాల్లో కూడా ఎవరికి ఏ కష్టం వచ్చినా కేఎన్ఆర్ ముందుగా స్పందించి తనకు తోచిన సహాయాన్ని చేస్తూ పంచాయతీలో ఒక మంచి నాయకుడిగా ఒక మంచి సేవా దృక్పథంతో ముందుకు సాగాలని పంచాయతీలో ఉన్న ప్రజలు కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసైనికులు జనసేన నాయకులు పాల్గొన్నారు.

# పాలిసెట్-2025 కు ఉచిత శిక్షణ



**అనకాపల్లి సి కె న్యూస్ ప్రతినిధి:** పాలిసెట్–2025 పరీక్షకు సిద్ధం అవుతున్న విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ పాలిటెక్నిక్, అనకాపల్లి నందు ఇచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు . అత్యంత అనుభవజ్ఞులైన పాలిటెక్నిక్ లెక్చరర్స్ చే ఈ శిక్షణా కార్యక్రమము నిర్వహి ంపబడుతుందన్నారు. పాలిసెట్ – 2025 పరీక్షకు ధరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థి ఈ సదావకాశాన్ని వినియోగించుకోవలసిందిగా ప్రిన్సిపాల్ విద్యార్థులకు సరిచించారు.

శిక్షణా తరగతులు తేది.03.04.2025 నుండి ప్రారంభమగునని, శిక్షణ తరగతులు ప్రతీ రోజు ఉదయం 9.30 గంటల నుండి 12.30 గంటల వరకు కళాశాల లోని బ్లాక్–3 నందు నిర్వహించ బడునని, ఆసక్తి కల విద్యార్థులు 9398848767, 8919790483 ఫోన్ నంబర్ లలో సంప్రదించి మిగతా వివరాలు తెలుకోవలసినదిగా తెలియజేసారు.

# ప్రత్యేక అమ్మకాల కేంద్రాలు ద్వారా బియ్యము మరియు కందిపప్పు అమ్మకం

**అనకాపల్లి, సి కె న్యూస్ ప్రతినిధి:** జిల్లా వ్యాప్తముగా ప్రత్యేక అమ్మకాల కేంద్రాలు యందు బియ్యము మరియు కందిపప్పు ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం విక్రయిస్తున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్. మూర్తి తెలిపారు. బుధవారం ఒక దినపత్రికలో వచ్చిన వార్తకు వివరణ యిస్తూ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వారి నుండి నెలవారీ కందిపప్పు కోటా అందని కారణముగా రాష్ట్ర వ్యాప్తముగా చౌక ధరల దుకాణముల ద్వారా సరఫరా కావటము లేదన్నారు. ఐనప్పటికీ ఇదివరలో పౌరసరఫరాల శాఖమాత్యులు మరియు కమీషనర్, పౌర సరఫరాల శాఖ మార్కెట్ ధరల (విపణి యందు ధరల ధరల) పెంపు పై సమీక్ష జరిపి ప్రజలకు అందుబాటులో గల ప్రదేశములు ఇంకా బహుళ సముదాయముల వర్తక కేంద్రాలు యందు ప్రత్యేక కేంద్రములు తెరిచి బియ్యము బీపీటీ / సోనామసూరి (స్టీమ్డ్) వెరైటీ కిలో 49 రూపాయలకు, బీపీటీ / సోనామసూరి (పచ్చి), వెరైటీ కిలో 48 రూపాయలకు మరియు కందిపప్పు కిలో 160 రూపాయలకు అమ్మకం జరపాలని నిర్ణయము జరిగిందని, వెంటనే తమ తమ జిల్లాలలో కేంద్రములు ప్రారంభించి సామాన్య ప్రజలకు అందుబాటులో తీసుకుని రావాలని ఆదేశించారన్నారు. సదరు ఆదేశాలననుసరించి జిల్లా వ్యాప్తముగా 58 ప్రత్యేక కేంద్రాలు యందు బియ్యము మరియు కందిపప్పు పై ధరల ప్రకారము అమ్మకం ప్రారంభించడము జరిగిందని ఆయన తెలియజేసారు. ఒక్కొక్క వినియోగదారుడు కందిపప్పు ఒక్క కెజి మరియు బియ్యము ఐదు కేజీలు అనకాపల్లి జిల్లా యందలి ప్రజలు పై సరుకులు ప్రత్యేక అమ్మక కేంద్రాలనుండి కొనుగోలు చేయవలసినదిగా తెలిపారు. ప్రస్తుతం అనకాపల్లిలో 8, చోడవరంలో 6, సబ్బవరంలో 5, ఎలమంచిలిలో 2, కశింకోటలో 1, రాంబిల్లిలో 1, నర్సీపట్నంలో 5, రోలుగుంటలో 2, నాతవరంలో 1, నక్కపల్లిలో 1, ఎస్.రాయవరంలో 1, పాయకరావుపేటలో 2, కోటఉరట్లలో 2, బుచ్చియ్యపేటలో 2, మాడుగులలో 2, మాకవరపాలెంలో 2, రావికమతం 3, కె.కోటపాడులో 5, దేవరాపల్లిలో 1, చీడికాడలో 1, పరవాడలో 2, అచ్చుతాపురంలో 2 ప్రత్యేక అమ్మక కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందని, ప్రజల అవసరాల కనుగుణముగా కేంద్రములు పెంచడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# ఆమె చేతుల్లోనే శ్రీలీల భవిష్యత్తు..?





కెరీర్ లో వచ్చీ రాగానే సూపర్ సక్సెస్ లు అందుకున్న శ్రీలీల ఆ క్రేజ్ తో సూపర్ పాపులారిటీ తెచ్చుకుంది. అంతేనా వరుస స్టార్ ఛాన్స్ లతో అదరగొట్టేస్తుంది. ధమాకా హిట్ తో వరుసగా ఐదారు సినిమాల ఆఫర్లు రాగా మరో ఆలోచన లేకుండా అమ్మడు సినిమాలు చేస్తూ వచ్చింది. ఐతే వాటిలో అమ్మడికి సక్సెస్ ఇచ్చిన సినిమాలు చాలా తక్కువ. బాలయ్యతో చేసిన భగవంత్ కేసరి హిట్ కాగా మహేష్ బాబుతో చేసిన గుంటూరు కారం సినిమా కాస్త పర్వాలేదు అనిపించుకుంది.అనతికాలంలోనే సూపర్ క్రేజ్ తెచ్చుకుని డ్యాన్సుల్లో తన టాలెంట్ చూపిస్తున్న శ్రీలీల ఈమధ్యనే వచ్చిన రాబిన్ హుడ్ సినిమా మీద చాలా హోప్స్ పెట్టుకుంది. ఐతే సినిమా మీద అంచనాలు ఎక్కువ అవ్వడంతో పాటు వెంకీ కుడుముల, నితిన్ కాంబో సినిమా పై క్రేజ్ ఎక్కువ అవ్వడం వల్ల సినిమాకు మిశ్రమ స్పందన వచ్చింది. ఐతే ఈ సినిమా తో తెలుగులో హిట్టు కొట్టేద్దాం అనుకున్న శ్రీలీలకు షాక్ తగిలింది.ఇక నెక్స్ట్ మాస్ మహారాజ్ తో మాస్ జాతర సినిమా చేస్తుంది శ్రీలీల. ఈ సినిమాతో అయినా అమ్మడు సూపర్ హిట్ కొడుతుందేమో చూడాలి. ఐతే శ్రీలీల ప్రస్తుతం తమిళంలో కూడా ఒక సినిమా చేస్తుంది. అక్కడ స్టార్ హీరో శివ కార్తికేయన్ తో పరాశక్తి సినిమాలో నటిస్తుంది అమ్మడు. తమిళ్ లో చేస్తున్న తొలి సినిమా అవ్వడంతో పరాశక్తి మీద చాలా హోప్స్ పెట్టుకుంది శ్రీలీల. మరోపక్క తెలుగులో కెరీర్ ఆశించిన స్థాయిలో లేదు అందుకే అమ్మడు పరాశక్తి మీద ఫుల్ ఫోకస్ చేస్తుంది.

పరాశక్తి సినిమాను సుధ కొంగర డైరెక్ట్ చేస్తున్నారు. ఈ సినిమా పీరియాడికల్ మూవీగా రాబోతుంది. స్టూడెంట్ లీడర్ గా శివ కార్తికేయన్ అదరగొట్టబోతున్నాడు. మరి పరాశక్తి సినిమా శ్రీలీలకు సక్సెస్ అందిస్తుందా లేదా అన్నది చూడాలి. శివ కార్తికేయన్ తో పాటుగా ఈ సినిమాలో జయం రవి విలన్ గా నటిస్తున్నాడు. సినిమాలో అథర్వ కూడా ఇంపార్టెంట్ రోల్ లో నటిస్తున్నాడు.

**నేహా మాలిక్ బ్లూ మినీ డ్రెస్‌లో మెరిసింది**



**రకుల్ ప్రీత్ సింగ్ అద్భుతమైన బ్లాక్ అండ్ వైట్ ఫ్యాషన్ వీక్ ఫోటోలు**

# క్యూట్ హీరోయిన్.. బేబీ బంప్ లైఫ్



టాలీవుడ్‌లో పెద్ద సినిమాలతో హిట్స్ అందుకోకపోయినా, ప్రణీత సుభాష్ తన అందంతో తో ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో విజయవంతం అయ్యింది. ఆమె పాత్రల్లో ఆమాయకత్వం మరియు నేచురల్ నటన, ఆమెను ప్రేక్షకుల ముందర ప్రత్యేకంగా నిలబెట్టాయి. పెళ్లి తరువాత ప్రణీత సినిమాలకు కొంత దూరంగా ఉన్నా, సోషల్ మీడియాలో ఆమె మాత్రం ఎల్లప్పుడూ దర్శనమిస్తూనే ఉంటుంది.

ప్రతిరోజూ కొత్త ఫోటోలు పోస్ట్ చేస్తూ, తన ఫాలోవర్స్ ను ఆకట్టుకుంటోంది. ఆమె గ్లామర్ ఫోటోలు చూసిన అభిమానులు తన వయసు తగ్గినట్లుగా అనిపిస్తుందని కామెంట్స్ చేస్తున్నారు. అలాగే ఆమె మరోసారి తల్లి కాబోతున్నట్లు ఇటీవల క్లారిటీ ఇచ్చింది. ఇక తరచుగా బేబీ బంప్ ఫోటోలను షేర్ చేసుకుంటోంది. తాజాగా ప్రణీత గాగుల్స్ పెట్టుకొని ఆమె ఇచ్చిన స్టైలిష్ పోజ్ కట్టిపడేసింది.

ప్రణీత తన బేబీ బంప్ ను హైలైట్ చేస్తూ మరింత అందంగా కనిపించింది. ఈ ఫోటోల్లో ఆమె ఇచ్చిన పోజ్ నెటిజన్లను ఆకట్టుకునేలా ఉంది. తక్కువ మేకప్ తో కూడా ఆమె తన అందాన్ని ప్రతిబింబించింది. అలాగే బంప్ లైఫ్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ఇటీవల ప్రణీత మలయాళ మరియు కన్నడ సినిమాలలో నటించింది. పలు డిఫరెంట్ పాత్రలు చేస్తూ, తన టాలెంట్ ను ప్రదర్శిస్తోంది. పెళ్లి అనంతరం రెగ్యులర్ కమర్షియల్ సినిమాలు చేయకుండా పాత్రలను జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటూ, ఆమె కెరీర్ ను కొత్త పుంతలు తొక్కిస్తోంది. ప్రణీత తన గ్లామర్ తో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ను ఎప్పటికప్పుడు సర్ ప్రైజ్ చేస్తోంది. 2010లో 'బావ' అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ప్రణీత, ఆ తర్వాత తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పలు సినిమాలు చేసింది. ఆమె అందం, నటన, మరియు నేచురల్ స్టైల్ ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. ప్రణీత తన కెరీర్ లో ఎప్పటికప్పుడు కొత్త ప్రయోగాలు చేస్తూ ముందుకు సాగుతోంది.